యీతనికవిత రఘునాథు నాకర్షింప వలసిన దే. దీనికి, కాళకవి తొలుత నుండి విజయరాఘవనాయకునే యాశ్రయింపఁగా, క్రమక్రమముగా, కాళకవి ప్రతిభ గుర్తించి యాతని కేవలకవిగానే గాక స్నేహితునిగా సంభావించి, విజయరాఘవనాయకుఁడు గౌరవించుచుండ, నాతఁడు రఘునాథనాయకుని యాస్థానకవిపదమునకుఁ బ్రయత్నముచేయు నావశ్యకత లేకపోవుటయే కారణముగాఁ గన్పట్టుచున్నది. విజయరాఘవనాయకుఁడు రాజ్యమునకు వచ్చినతోడనే గ్రంథమాతనికి కృతినొసంగుటకూడ పై యంశమును బలపఱచు చున్నది. మఱియును రాజైన విజయరాఘవనాయకుఁడు తనయింటికి తనభార్యలతోఁగూడవచ్చి విందారగించి, యింటివారలనందఱను ననేకవిధముల గౌరవించెనని చెప్పిన యీక్రింది సందర్భమును బట్టి, వారిరువురికెంత యన్యోన్యగౌరవ స్నేహ బాంధవము లుండెడివో గ్రహింపవచ్చును.

విజయరాఘవనాయకుఁడు గ్రంథమంకితముగోరుచు నిట్లు చెప్పినాఁడు

మ. పదియాఱ్వన్నె పసిండికిన్ వలపుపై పైఁజెందు చందంబునన్
చదురుల్ మీఱుభవత్ప్రబంధమిల నిచ్చల్ దక్షిణ ద్వారకా

సదనాస్థాన కథానుషంగములచే సంభావ్యమై మించె నే
డది మాకంకిత మీవొనర్పుమని యాహ్లాదంబు సంధిల్లఁగన్.

సీ. అల సహ్యజాతటి నగ్రహారంబులు
బహురేకమించు నుంబళికయూళ్లు
బంగారు వనుసుల పచ్చల పల్లకి
పసిఁడికొమ్ముల కట్లభద్రకరులు
పడివాగె తేజీలు బంగారుకాళాంజి
హడపంబు చామరల్ హంసకంబు
తరమైన చౌకట్లు తారహారంబులు
నంగుళీయాది రాజార్హభూష

గీ. లెలమి నపరంజి హరివాణములును గిండ్లు
పెట్టెలకొలంది జాలెలు మట్టుమీఱి
.......................ఘనత
కనుగుణంబుగ దయచేసి యపుడు మఱియు

క. కేళాకూళుల సజ్జల
కేళీవనములను మించు గృహరాజంబున్
శ్రీలెసఁగ నొసగి లోకులు
మేలని కొనియాడ కరుణ మీఱఁగనంతన్.

గీ. విందునకుఁ దాము గఱితలు వేడ్కవచ్చి
వరుస సొమ్ములు తమయింటి వారికొసఁగి
యాత్మజులకెల్ల చతురంత యానములను
మహితభూషణములు బహుమతులుసేయ ”

పైపద్యములవలన కాళకవినెంతగ గౌరవించినది మనకు తెలియవచ్చును. కాళకవిని కవిగానెంచక, రాజకవిగానెంచి యాతనికివివిధరాజ చిహ్నములనొసగి విజయరాఘవుడు సమ్మానించెనని యాశ్వాసాంతగద్యవలన నెఱుకపడుచున్నది. "ఇతి శ్రీమత్కాళహస్తీశ్వరకరుణాకటాక్ష లబ్ధ సిద్ధ సారస్వత నయ చెంగల్వ వేంకటార్యతనయ, విజయరాఘవభూపప్రసాదాసాదిత, వివిధరాజచిహ్నచిహ్నితభాగధేయ కాళయనామధేయ ప్రణీతంబైన రాజగోపాలవిలాసంబను మహాప్రబంధంబునందు ప్రథమాశ్వాసము."

కాళయ ప్రతిభావంతుడైనకవి. బంగారమునకుఁ బరిమళమబ్బినట్లుగా, నీతనికి విద్వత్కవిరాజగు విజయరాఘవనాయకుని స్నేహబాంధవము సమకూడినది. ఈ రాజగోపాల విలాస మొకటి తప్పతక్కిన యీతనికృతులేవియు కానరాలేదు. అయిన కాళయ కవితావైశద్యమును ప్రకటించుటకు నీప్రబంధమొక్కటియే చాలును. ఈ విషయమును గూర్చివిస్తరించుటకు ముందు, కృతిపతియగు విజయరాఘవనాయకుని గూర్చి మనము తెలిసికొనఁదగును.

రాజగోపాలవిలాసమున ప్రథమాశ్వాసమున కృత్యవతరణికలో రమారమి యేబది పద్యములలో విజయరాఘవనాయకుని యుదంతమంతయు వివరింపఁబడినది. ఆతని పూర్వులసంతతి సంగ్రహముగను,తక్కిన కృతిభర్తసంగతి సవిస్తరముగను నందు వర్ణితమైనది. ఈ భాగమునే 'విజయరాఘవ వంశావళి' యని వేఱుచేసి వ్రాసినట్లు మున్ను తెలిపియుంటిని, దీనివివరణము,

## —: విజయరాఘవనాయకుని చరిత్ర :—

శ్రీహరిపాదపద్మమున నాల్గవజాతి ప్రభవించెను. ఆజాతిలో కొందఱు రాజచంద్రు లుదయించిరి వారిలో కృష్ణరాజను నాతఁడు మొదటివాఁడు. అతనికితిమ్మరాజు జన్మించెను. తిమ్మరాజు గుణాతిశయముచే శ్రీహరియే మానవునిగా నవతరించినట్లు ప్రఖ్యాతిగాంచెను. అతనిభార్య బయ్యాంబ. వారలకు మహాప్రసిద్ధుఁడు చెవ్వనృపతి కొమారుఁడయ్యెను. ఆతఁడు శ్రీశైలమునకు సోపానపంక్తికట్టించి, ప్రాకారమును నిర్మించెను. వృద్ధాచలమున ప్రాసాద మండపములుగట్టించి గ్రామముల నాక్షేత్రపతికి దాన మిచ్చెను. అరుణాచలమున దేవాలయమునకు గోపురముకట్టించెను. వృషభగిరియందు పూజాదికము లేర్పాటుచేయించెను. చెఱువులు త్రవ్వించి, షోడశమహాదానములు కావించెను. ఈతనిని చినచెవ్వప్పయని యందురు. చినచెవ్వప్ప మూర్తిమాంబను పెండ్లియాడి యామెవలన అచ్యుతప్పనాయకుఁడను పుత్త్రునిఁ బడసెను.

అచ్యుతప్పనాయకుఁడు శ్రీరంగనాథస్వామికి సింహాసనము ప్రణవమయమైన బంగారుసెజ్జ, రత్నాంగద కిరీటరాజము, అభయహస్తము నర్పించుటయేగాక దేవళమునకు నెనిమిదవ ప్రాకారమును గోపురమును, సన్నశాలయును కట్టించెను. ప్రాకారములలో నారామములు నిలిపి, చైత్రరథారోహణోత్సవము జరిపించు నేర్పాటుచేసెను. అచటనున్న యర్చకకోటి కగ్రహారములిచ్చి, వివిధనాట్యసేవ, నివేదనములు ప్రతిదినము జరుగు కట్టడఁగావించెను. శ్రీరంగపతి సన్నిధానమునముత్యాలతో తులాపురుష దానమును గావించెను. ఈతఁడు భక్తిపరుఁడేకాక పరాక్రమవంతుఁడని సమర నిశ్శంకుఁడని కీర్తిఁగొనెను.

ఇట్టి యచ్యుతనాయకునికి మూర్తిమాంబకు రఘునాథ నాయకుఁడు జన్మించెను. రణము పెండ్లిచవికెగా భావించినమహా వీరుఁడు రఘునాథుఁడు. అతడు పాండ్య, తుండీర, చేర, పారసీక, ఆంధ్రదేశరాజుల నందఱనుజయించి, విజయలక్ష్మిని వరించెను. అతఁడపజయమన నెఱుఁగఁడు. ఈతఁడు రణరంగధీరుఁడై నను శత్రురాజులు వెనుకనుకుఁ దగ్గినవారిని సంరక్షించి, వెన్నాడక యుండువాఁడు. ఈతని యేనుగుల శాలలో, వింధ్యసింహళపు యేనుగులు, గుఱ్ఱాలశాలలో. శక, సింధు భాహ్లీక దేశపు గుఱ్ఱములు నుండెడివి. భాండాగారములో కోట్లసంఖ్యకుమించు నవరత్నమయ కాంచనాభరణములు, ప్రకాశించెడివి. నగరిలో మెఱపు దీగెలఁ బోలిన మెలతలు, మెలఁగెడివారు. ఇవియన్నియు శత్రురాజుల కానుకలు. ఈతఁడు జయించినవీరులకు లెక్కలేదు. వైరి రాజుల శిరస్సులను పాషాణములతో నీతఁడు కావేరీనది కానకట్ట గట్టినాఁడనవచ్చును. కృతులు మెచ్చంగఁ దగినసత్కృతులు. ధరాదేవికి హారములనదగు నగ్రహారములు, సకలదేవాలయ ప్రతిష్ఠలు సర్వవిధములైన దానములను చేసి రఘునాథనాయకుఁడు రాజ్యమేలెను.

రఘునాథరాయని భార్య కళావతి. ఆమె పరమపతివ్రత. వారికి, అచ్యుతరామభద్రుఁడని విజయరాఘవనాయకుఁడని యిరువురు కుమారులుగలిగిరి. అందు పెద్దవాఁడగు రామభద్రుఁడు మహావీరుఁడు. అతని నిలువెల్ల కరుణ. ఆతనిపలుకులు నీతిప్రచారములు. తలపులు ధర్మమునకు పుట్టినిండ్లు. నడకలు దాక్షిణ్యసంకేతములు. ఆతఁడు మన్మథునివంటి సుందరుఁడు, అతనిసోదరుఁడే విజయరాఘవనాయకుఁడు. ఇతఁడే కృతిభర్త.

ఈతఁడు మహాపరాక్రమశాలి. శత్రురాజుల నిగూఢతంత్రంబులెఱుఁగు నింగితజ్ఞత, వైరిరాజభూతములను నిగ్రహించు శక్తి, పరిపంథివర్గమును స్తంభింపఁజేయు మగఁటిమి, పరరాజులను జంత్రపుబొమ్మలవలె నాడించుబుద్ధిసూక్ష్మత, యితనియందు మూర్తీభవించియుండెను. ఒకనాఁడే యైదారుయోజనములు మేరదాడివెడలి తిరిగివచ్చు దండితనము, ఒకగుఱ్ఱముపైనుండి వేఱొకగుఱ్ఱముపైకి నెగురులాఘవము, మావంతునెదిరించి యేనుగుపైకి నెగిరి దానినదలించు భుజశక్తి, ఎట్టిశూరునైన నెదుర్కొని, వానిమర్మములు నాఁటునట్లు సూటిగా కత్తిమీఁటు చాకచక్యము నీతనియందే కన్పట్టును.

—: సాహిత్యరాయపెండేరము :—

ఈతని కాలికి 'సాహిత్యరాయ పెండేరము' అను బిరుదందె కలదు. అది, వైడూర్యములతోను, పద్మరాగములతోను, ముత్యములతోను, నీలములతోను కూర్పఁబడి సామంతరాజులు మ్రొక్కుచున్నప్పుడు వారికిరీటముల కాంతు లీగండపెండేరమున కుపచార సమకూర్చుచున్నట్లు మెఱయుచుండెడిది. సభయందు, జరుగు తర్కవ్యాకరణమీమాంసాచర్చలు, నవ్యకావ్యసాహితీనైపుణ్య ప్రదర్శనములు, లక్ష్యలక్షణగ్రంథసమన్వయచాతుర్యములు, చమత్కారభాషాగోష్ఠీవినోదములు నీగండపెండేరమున కుపచారముచేయుచున్నట్లు కన్పట్టెడిది. ఈ పెండేరనినాదము బిరుదవాద్యములనాదమున కుత్కర్షగలిగించుచు, విద్యావిషయకసందేహములు గలిగినప్పుడు రాద్ధాంతనినదమును ప్రకటించుచు సకలవిద్యాసామ్రాజ్యసింహాసన మెక్కినట్లు విలసిల్లుచుండెను. మఱియు నీపెండేరమున నాతఁడు జయించినరాజులు బొమ్మలై వ్రేలుచుండిరి.

—: శారదాధ్వజము :—

ఈతఁడు 'విజయరాఘవవిలాసంబున' విద్యాగోష్ఠి నున్నప్పుడు, పైపెండేరముగాక, యాతనిముందరి "శారదాధ్వజము" నొప్పుచుండును. ఒక్కయెడ చీనిచక్కెర పానకమువలె మధురమై, వేఱొకయెడ విరజాజి పూవుదండవలె పరిమళయుక్తమై, మఱియొక్కయెడ మలయమారుతమువలె చల్లనై, యింకొకయెడ, నిండువెన్నెలవలె నిరతిశయాహ్లాదకారియై వెలయునట్లు కవితచెప్పఁగల చాతుర్యము విజయరాఘవనాయకునికే కలదని, తనహస్తముచే నీధ్వజము చాటుచుండును.

"పద్యమునవనవోన్మేషమై వెలయవలెను. వాక్యవైఖరులలంకారానుసారులు కావలెను. శబ్దము పాణినీయవ్యాకరణప్రామాణ్యమై యుండవలెను. కర్పూరమువలె కవితాసందర్భము చప్పున గుబాళింపవలెను" అని శారదాధ్వజము చాటుచుండెడిది.

విజయరాఘవనాయకుని సాహిత్యగోష్ఠిలో, పసిఁడి తీవలఁబోలిన పడఁతులు "పాండ్యమండల విభాళా" యంచు కైవారము చేసెడివారు. భరతసంగీతసాహితీవిద్యలు భామాస్వరూపములు దాల్చినవో యనునట్లు, తమతమబిరుదు వాద్యములు, చిహ్నములు వెలయఁగా తారుణ్యవతులగు తరుణు లందు తనరారుచుండిరి. వారిలో నాటకత్తెలు పాటకత్తెలు నుండిరి. ఆటకత్తెలలో

చంద్రరేఖ

యను నామె యగ్రస్థానమధిష్ఠించినది. ఈమె విజయనగర సామ్రాజ్యాధీశుఁడగు వీరవేంకటరాయపృథ్వీమహేంద్రునివలన బహువిధబిరుదగౌరవముల నందిన నట్టువరాలు. ఈమె

కాక నీ క్రింద నుదాహరింపఁబడిన నాట్యకత్తె లాసభయందెన్నిక గన్నవారు. వారొక్కొక్క నాట్యమున ప్రత్యేకవిశిష్టత గడించి నారు.

| | | |
|---|---|---|
| రూపవతి | – చౌ పదములు | నాట్యము |
| చంపకవల్లి | – శబ్దచూడామణి | ,, |
| మూర్తి | – జక్కిణి | ,, |
| కోమలవల్లి | – కొరవంజి | ,, |
| లోకనాయక | – నవపదములు | ,, |
| శశిరేఖ | – దేశి | ,, |
| రత్నగిరి | – దరుపదములు | ,, |
| భాగీరథి | – పేరణి | ,, |

ఇంకను, మదనపదములు, దూత్యము, నవరత్నమాలికలు మున్నగువాని నితరు లభినయించెడివారు, అన్నియును శాస్త్రోక్తముగా నభినేయములగుచు, వారి నాట్యకళా నైపుణ్యమును, సువ్యక్తము గావించెడివి.

సంగీతమును నీవిధముగనే పాటకత్తెలు ప్రపంచించిరి. ఒక భామ వీణె, ఒక లేమ కిన్నర, నొకముదిత ముఖవీణె నొక కొమ్మ పిల్లనగ్రోవి, ఒక ధవళాక్షి తంబురా, ఒక సారసాక్షి స్వర మండలము చేకొని, వానిపై సంగీతము వినిపించిరి. ద్విపదలొక తెలివ, తత్త్వసంగ మొకతన్వి, యక్షగానమొక యతివ, జోలసువ్వాలలొక సుందరి, ధవళంబులొక తరుణి, ఏల లొక యించుబోణి- దండె మీటులతో, రావణహస్తములతో, తాళ ములతో, చెంగులతో సకలహృదయ ద్రవీకరణకారణలై సకల సభాహ్లాదకారిణులై జంత్రగాత్రముల గాంధర్వవిద్య వినిపించిరి.

కేవల శాస్త్రీయమార్గమున నొక కీరవాణి, స్థాయిగమకము రక్తి గడలుకొన, రాగాలాపన చేసెను. ఇక తక్కిన వెలఁదులు వాద్యములతో విద్యుద్వల్లులవలె గోష్ఠి సాగించునప్పుడు, ఆకాశమునుండి విద్యాధరులు, తాము ను రమణీవేషములు ధరించి యీ విద్యలు నేర్చుటకై భూమికివచ్చిరోయని భ్రాంతి గలిగించిరి. ఆసభయందే కృష్ణమాంబ తన కవితాచాతుర్యమును చూపి, యందఱ నాశ్చర్యమనస్కులుగఁ జేసెడిది.

విజయరాఘవనాయకుఁడిట్టి విద్యాగోష్ఠియందు నిమగ్నుఁడై నను, నిరంతరదానశీలియై ప్రజలనేమఱక పోషించుచుండెను. కాశీనుండి, రామేశ్వరమువఱకును, ద్వారకనుండి దక్షిణతీరము వఱకును, నీతని యన్నదానమును వినుతింపని బ్రాహ్మణులు లేరు. ప్రతిదిన మేఁబదివేలమందికి నన్నదాన మొసఁగెడు మహాదాత.[1]

ఆతఁడు, శా. శ. 1555 నకు సరియగు శ్రీముఖ సంవత్సర శ్రావణశుద్ధ ద్వాదశీ, సౌమ్యవారమున, దక్షిణద్వారమున కృష్ణతీర్థమున స్నానముచేసి, సంకల్పపూర్వకముగా షోడశ మహాదానములుచేసి, బ్రాహ్మణులకు నగ్రహారాదికము లొసంగెను. ఇది క్రీ. శ. 1633 సంవత్సరము. ఈనాఁడే విజయరాఘవుని రాజ్యారోహణ దినము. ఇట్టి మహావిద్వత్కవిరాజచంద్రునికి, కాళయకవి తన గ్రంథమును పై సభయందు సంకితముగావించెను. పైని పేర్కొనిన కాలమే యీకృతి రచనాకాలమని యూహింపవచ్చును. అట్లయిననిది విజయరాఘవనాయకుని రాజ్యారంభవత్సరముననే వెలసినది. విజయరాఘవనాయకుఁడు నలువ

---

1. ఇప్పటికి నన్నదానములకు ప్రసిద్ధికెక్కిన యిండ్లకుగాని సత్రములకుగాని "తంజావూరి సత్రములు" అనిపేరు వాడుకలోనున్నది.

దేండ్లు పాలించినాఁడు. తరువాతి కాలమున నీతని యాస్థానమున పెక్కురు కవులును మహాప్రసిద్ధిఁ జెందిన కవయిత్రి రంగాజమ్మయు వెలసిరి. ఈ గ్రంథమున వారి ప్రశంసయే లేదు. ఇంతియేకాక, ప్రతి యాశ్వాసాంతమున నీ కావ్యము " చంద్రరేఖా " చిహ్నితమై యున్నది.

ప్రథమాశ్వాసము - క, ధావనవల్గన వేష్టన
రేవంతక " ముద్దుచంద్రరేఖా"
కాంతా !
ద్వితీయా ,, - తపనాభాంత ధ్వాంత
ద్రిపుయూథా"ముద్దుచంద్రరేఖా"నాథా!
తృతీయా ,, - చతురానన చతురవధూ
శ్రితవదనా"ముద్దుచంద్రరేఖా" మదనా !
చతుర్థా ,, - " శ్రీముద్దుచంద్రరేఖా "
ప్రేమస్థేమాభిరామ"

ఈ మెనుందు చెప్పబడిన నట్టువరాలు చంద్రరేఖయే. వీరవేంకటపతిరాయల వలన మెప్పుచెందిన యీమె. క్రీ. శ. 1614 ప్రాంతమున తంజావూరినిచేరి విజయరాఘవ నాయకుని చేపట్టి యుండవలెను. కాని యప్పటి కాతఁడు యువరాజుగనే యుండెను. రాజ్యమునకు రాగానే యీమె నొక మహిషిగా పరిగణించుటచే, కాళకవి యిట్లామె నామాంకితమును వెలయింపఁ జేసి యుండును. కావున నీకృతి విజయరాఘవుని కాలమున ప్రాథమిక కృతియే. మఱియు నిందు విజరాఘవనాయకుని సాహిత్య విద్యావైభవము వర్ణితమైనను నసంఖ్యాకములైన నాతని గ్రంథ రచన లేవియును దాహృతములు కాలేదు. అనగా నీకృతిరచనము

నాఁటికింకను గ్రంథరచన నాతఁడు ప్రారంభింపలేదని తెలియు చున్నది. ఇదియును పై యభిప్రాయమునే బలపఱచుచున్నది. ఇఁక గ్రంథ విషయము.

ఇది దక్షిణద్వారకాస్థల మహాత్మ్యమును దెలుపు నైదాశ్వాసముల ప్రబంధము. దక్షిణద్వారకయనగా తంజావూరిజిల్లా లోని మన్నారుగుడి. అచ్చటనున్న స్వామి రాజగోపాలుఁడు. ఈస్థల మహాత్మ్యమునకు మూల మగ్నికల్పమని తెలుపఁబడినది. సూతుఁడు శౌనకునియడుగగా శౌనకుఁడాతనికి 'చంపకవనాంతరమున గోప్రళయమనాని తపస్సుచేసి హరినివేడగా నాతఁడు ప్రత్యక్షమై, యాతని కోర్కె ననుసరించి, పదాఱువేల గోపికలతో, అష్టమహిషులతో నచ్చటనే నిలిచెను' అని చెప్పుట కథాబీజము.

ఈ ప్రబంధమున కథాసారము.

చంపకవనమున శ్రీకృష్ణుఁడు వనవిహారము సలుపుచు అష్టవిధ శృంగార నాయికలవలె చెలఁగుచున్న తన యష్టమహిషుల స్వభావములు తెలియఁగోరి, వారివారి నాయాజాడల నుండ నియమించెను. తొలుత రుక్మిణి జాడకరిగి, యామెకుఁ గనఁబడకుండ పొంచియుండి యామె యనుతాపము, హృదయము నెఱింగి, యెదుట ప్రత్యక్షమై యానందాబ్ధినోలలాడించెను. ఆ వెనుక భద్రవద్దకు నొకదూతి నంపి, సంకేతస్థలము చెప్పి, తానచ్చటి కేఁగెను. కాని భద్ర యలిగి కొంతతడవు కృష్ణుని విరహవేదనకుఁ బాలుపఱచెను. అంత లక్షణ తన జాడలో నొక చంద్రకాంత శిలపై కృష్ణునికొఱకు నిరీక్షించు తన సౌధమునంతయు నలంకరింపఁజేసెను. ఆతఁడు రాకపోవుటచూచి యొకదూతిని పంపి, రప్పించెను. శ్రీకృష్ణుఁడామెను సమ్మదాంతరంగితగా నొనర్చి, తక్కిన

కాంతలం దలంచుకొని వారి సమాగమము కాంక్షించుచుండెను. జాంబవతి తనదూతికతో విరహవేదన నివేదింప నామెవలన శ్రీకృష్ణుఁ డెఱింగి పొదలచాటున యామె యనురాగమ్ము గ్రహించి, యామెను మోదమునఁ దేల్చి, మిత్రవింద సౌధమున కేగి, యామెను ముదితురాలుగ నొనర్చి విరహగ్లానిచే కుందు చున్న సుదంతను సంతసపఱచెను ఆపై తనకొఱకు వ్యధచెందు కాళింది నానందమున దేలించి, సత్యభామను, సకల సౌఖ్యముల సంభావించెను.

ఆపైని దక్షిణద్వారకానగరమును కవి వర్ణించి చంపక వనమునకు దక్షిణ ద్వారకాసంజ్ఞ గలుగుట వివరించియున్నాఁడు.

చంపక వనమున తపస్సు చేసెడు ఋషులలో వహ్నిముఖుఁడను సంయమిశ్రేష్ఠుఁడు గలఁడు. అతనికి గోప్రళయుఁడు గోభిలుఁడు నను నిరువురుతనయులుగలిగిరి. వారిరువురిలో గోప్రళయుఁడు, స్నానసంధ్యాజపహోమకృత్యంబులునిర్వహించుచునతిథి యభ్యాగతులనుపూజింపుచు, నిరంతరభగవద్భక్తి సంప్లావితుండై శ్రీహరి గూర్చి తపస్సుచేయ నారంభించెను. అతడు శీతవాతోష్ణ స్థితుల లెక్కించపక నుగ్రరీతి తపస్సుచేయుట తోడనే శ్రీ మహా విష్ణు వాతని తపశ్చర్యకు మెచ్చి ప్రత్యక్ష మయ్యెను. గోప్రళయుఁ డాతని బలువిధముల ప్రణుతించెను. మహావిష్ణువు మిక్కిలి సంతసించి వరము కోరుకొమ్మనెను. గోప్రళయుఁడు రుక్మిణి మొదలగు పట్టమహిషులు పదారువేల గోపికలు వీరితో శ్రీ కృష్ణావతారమున ద్వారకలో నున్నట్లుగా చంపకవనమున నివసింపఁగోరెను. అంత మహావిష్ణు వట్లే చంపకవనమునకు దక్షిణద్వారకాసంజ్ఞ నిచ్చి యచ్చట కృష్ణావతార రూపమున వసించెను. గోప్రళయుఁ

డా క్షేత్రంబున తొలుత కృష్ణుని వరము వలన కృష్ణతీర్థమున్ను నందుండి హారిద్రానదిని గలుగ జేసెను. విష్ణు పుష్కరిణి నిర్మించెను. అచ్చటనే బృందావన రూపమున వనముఁ బ్రతిష్ఠించెను. గోభిలుఁడుకూడ గోప్రళయు న కీ క్షేత్రనిర్మాణమున తోడుపడెను. కొంత కాలమునకు గోప్రళయుఁడు వైకుంఠవాసి యయ్యెను.

ఇచ్చట బ్రహ్మ తొలుత తపస్సు చేసెను. మహాలక్ష్మి విష్ణువును గూర్చి తపస్సు చేసెను. శ్రీమహావిష్ణువు వారివారి కోర్కెల నెఱవేర్చెను.

ఆపైని హారిద్రానదీ ప్రభావమువర్ణితము. ఏపాపమునకైన నిష్కృతి గలదు గాని కృతఘ్నతకు నిష్కృతి లేదు. అట్టి కృతఘ్నతా దోషమును తొలంగించిన హారిద్రానదీప్రభావమున కొక కథ యను సంధింపఁబడినది. గోదావరీనది యుత్తరమున సింధుసౌవీరమధ్యప్రదేశమున సౌరాష్ట్ర దేశము గలదు. దానిని రాజశేఖరుఁడను రాజుపాలించుచుండెను. అతఁడొకనాఁడు వేఁటకు బయలుదేఱి సాధన సామగ్రిచే యాటవికులతో చాల తడవు వేఁటలాడి యనేక మృగములను జంపెను. అంత నొక వరాహము చెంచులకు వశము గాకుండ తన యెదుటనుండి పోవుచుండగా దానిని పట్టుకొనుటకై వెంట తరిమెను. కాని రాళ్ళు రప్పలు, గట్టులు పుట్టలు దాటినను చిక్కలేదు. అతఁడును మిగుల డస్సి, దాహము మిక్కుటము కాగా నక్కడ నొక యాశ్రమము గన్పడ నందు ప్రవేశించెను. అచ్చట యజ్ఞశీలుఁడను ముని యాతని సేదదీర్చి, యాదరించి, యన్నపానాదుల సంతుష్టుం గావించి తన పురమున కనిచెను. ఆ వెనుక. నీ రాజునకు కృతజ్ఞతా స్వభావ మెంతవఱకు నున్నదో పరీక్షించుటకై

మునిరూపముననే దొంగవానివలె, చీకటి పడగానే రాజుగారి ధనాగారములోని విలువగలవానిని గ్రహించి, పట్టుకొని పోవు చుండెను. అంత తలవర్గాతని పట్టుకొని, కట్లుకట్టి రాజుగారి ముందఱ నిలువఁబెట్టిరి. అంత రాజు మునిని చూచి తన కుపకృతి చేసినవాఁడని గ్రహించియు సొమ్ము తీసుకొని నాతని దుర్భాష లాడి యవమానపఱచి, యూరు వెడలఁద్రోయించెను. అంత కృతఘ్నతా దోషముచే, రాజు మతిభ్రాంతికలిగి పిచ్చివాఁడై యడవుల దిరుగుచుండెను తన యాశ్రమము ముందు రాగానే యజ్ఞశీలుఁ డతని పాపము పరిహరించెదనని యాతని చేరఁబిలిచి యిది వచ్చుటకు నాతని రాజ్యమదాంధతయు కృతఘ్నతయే కారణమని తెలిపెను. మఱియును బ్రాహ్మణాశీర్వాదము వలన సర్వశుభములును సమకూరవలయుననియు నచ్చట హరిద్రా నదిలోఁ గ్రుంగిన తన పాప నివృత్తియైపూర్వరూపము వచ్చునని చెప్పెను. అట్లు చెప్పిన తోడనే హరిద్రానదిలో మునుఁగగానేతన పూర్వ తేజస్సు, రూపమును ధరించి, విష్ణుభక్తుఁడై యచటి రాజ గోపాల స్వామికి నంతయుకైంకర్యము చేసి కృతార్థుఁడయ్యెను.

శ్రీకృష్ణుని యష్ట మహిషులును నష్టవిధశృంగార నాయికలుగా నిరూపించి, కవి, యాలంకారికశాస్త్రానుగుణ్య ముగ, శృంగార రస పోషణము గ్రంథమున నిట్లనుసంధించి నాఁడు.

| | | | |
|---|---|---|---|
| రుక్మిణి | - స్వీయ | | ప్రథమాశ్వాసము. |
| భద్ర | - కలహాంతరిత | } | ద్వితీయా ,, |
| లక్షణ | - వాసవసజ్జిక | | |

| | | | |
|---|---|---|---|
| జాంబవతి | - విప్రలబ్ధ | } | తృతీయా ,, |
| మిత్రవింద | - ఖండిత | | |
| సుదంత | - విరహోత్కంఠిత | | |
| కాళింది | - ప్రోషితభర్తృక | } | చతుర్థా ,, |
| సత్యభామ | - స్వాధీనపతిక | | |

ప్రథమాశ్వాసమున మొదట యవతారికయు, పంచమాశ్వాసమున చివఱ క్షేత్ర మహాత్మ్యమును సంఘటించి గ్రంథము పూర్తి చేసినాఁడు. గ్రంథ మందంతటను శ్రీరాజగోపాలనామమున వెలసిన శ్రీ కృష్ణుని విలాసములే గావున నీ ప్రబంధమునకు రాజగోపాలవిలాసము అను పేరు సార్థక మగుచున్నది. "విజయరాఘవ విలాస భవనమును రాజగోపాల విలాస మలంకరించుట విశేష సంఘటనమే గదా!

ఇందైదాశ్వాసములలో 454 పద్యములు గలవు. ఇది ప్రబంధమని యనిపించుటకు, చతుర్థాశ్వాసమున ద్వారకాపుర వర్ణన, పంచమాశ్వాసమున, వేట వర్ణన చేయఁబడినది.

కాళయకవి కవిత, ధారాశుద్ధి గలిగి ప్రసన్నమై మృదు మధురమై వెలయుచున్నది. సంస్కృతసమాసము లుపయోగించిన నవి ప్రసాద గుణము గలిగి, హాయిని గూర్చును. ఈతని సమాసరచన నన్నయ శ్రీనాథుల రచనఁ దలపించును.

మ. కలమంద్రోదిత రత్నకంకణ ఝణత్కారంబు తోరంబుగాఁ
దలిరుం దీవెలు చంచలించుగతి హస్తన్యాసముల్ మీఱఁగా
లలనల్ "పాండ్య నృపాల మండల విభాళా" యంచు
గైవారముల్
వలనొప్పన్ రచియించి రంత నుచిత వ్యాపార పారీణతన్,

చ. మలయతటీపటీరతరుమాంసలసౌరభభారమందు సం
చలనసమీరలోలజలజాతసుజాతపరాగరాగముల్
కలిత మనోహరాస్తరణకాంతనిశాకరకాంత వేదికా
తలముననుండి యవ్వికచ తామరసాక్షిఁ దలంచి యిట్లనున్.

క॥ హరియించె వారి బడలిక
పరిసరకాసారతీరపరిచితహంసీ
గురుదంచల హతిచంచల
సరసిజదళతాళవృంతజాతానిలముల్.

నన్నయవలె మత్తేభ వృత్తము నడిపించుటయందు కాళకవి గట్టివాఁడు.

మ. సుమనస్నాయకలోలచాపగుణఝర్ఝాతర్జనల్ సేయునీ
భామహాల్పంబు తదీయబాణముల సొంపుల్ వంపువాల్జూపు
లున్
ప్రమదాంభోనిధిఁ దేల్చె, సౌఖ్యములు నాపాదించె నూహిం
చఁగా
రమణీ! కోపము సేయునట్టి యుపకారం బెన్నఁగా శక్యమే!

అచ్చతెనుఁగు పదములతోనిట్లే :—

మ. తొగరార్గా తెగమేడ యోవరులజోతుల్ తేటనిద్దంపులే
జిగురు న్వెన్నెల చల్వ చప్పరములన్ చిన్నారి పూగుత్తులన్
నెగడం జేయఁగ బాటనుండి వలితేనెల్ చిందు
చందంబునన్
చిగురుం బోడి మురాజేరి పలికెన్ చిత్తంబు రానత్తఱిన్

మ. కలలో నైనను నీదు మాటలకు నౌఁగాదంచు మాటాడుటల్
గలవో? వాడలవాడలం దిరిగి రాగా నీకు మెండొడ్డుటల్
గలవో? చూచినవారలందఱు నగంగా నిన్ను విన్నాణముల్
గలవో? మానవతీవిలాస మకరాంకా! యింక నేమందురా?

ఇందు శృంగారరసము అమరుకకావ్యము నందువలె భావప్రధానము గాని, యాంధ్రకావ్యసాధారణమగువర్ణన ప్రధానము గాదు-వస్తువర్ణన గావింపక, భావస్ఫోరణీముగ సంభాషణమూలముననే శృంగారరసావిష్కరణము గావించిన కాళకవి ప్రతిభ యసమానమైనది.

రాజగోపాల విలాసమునకు కొంచెము ముందుగఁ బుట్టిన విజయ విలాసముతో సరిచూచిన నీ విషయము స్పష్టము-విజయ విలాసమున శ్లేషల మూలమున వర్ణనల మూలమున వేంకటకవి రససిద్ధి గావించినాఁడు. జాంబవతి లక్షణ నాయికల ఘట్టములోని సంభాషణలు చూచిన కాళకవి కేవలశ్లేషవర్ణనల పొంతఁబోక యెంత భావప్రధానముగ రచించినది తెలియఁగలదు.

ఈ గ్రంథము విజయరాఘవనాయకుఁడు సింహాసన మెక్కిన తొలి సంవత్సరముననే యనఁగా క్రీ. శ. 1633లో రచియింపఁ బడినది. కాబట్టియే నీ మహారాజు కాలమున విలసిల్లిన రంగాజమ్మ మొదలగు కవయిత్రుల వృత్తాంతముగాని, విజయరాఘవ నాయకుని రచనలు గాని యిందుండుట కవకాశము లేదు. విద్వత్కవియు, విష్ణుభక్తాగ్రేసరుఁడగు విజయరాఘవనాయకుని కాలము నాఁటి విస్తృతమగు వాఙ్మయమునుగూర్చి యికముందు వివరించుచున్నాను.

## —: విజయరాఘవనాయకుని కాలమున వర్ధిల్లిన యాంధ్ర వాఙ్మయము :—

### విజయరాఘవనాయకుఁడు.

విజయవిలాసకృతిభర్తయై, వాల్మీకిచరిత్రాదికృతికర్తయై సంగీతవిద్యావిశారదుఁడని మహాప్రసిద్ధిఁ జెంది యాంధ్రులకుఁ జిరస్మరణీయుఁడగు తంజావూరు రఘునాథరాయని కొమారుఁడీ విజయరాఘవనాయకుఁడు. రఘునాథరాయని వెనుక క్రీ. శ. 1633 నుండి క్రీ. శ. 1673 వఱకును దంజావూరును బరిపాలించెను. ఈతని కాలముననే మహారాష్ట్రులు తంజావూరిరాజ్యము నాక్రమించుకొనిరి. ఈతని కొమరుఁడు మన్నారుదేవుఁడుకూడ తండ్రితోఁగూడి మహారాష్ట్రులతో యుద్ధమున మడియుటచే తంజావూరు నేలిన యాంధ్రరాజులలో నీతఁడు కడపటివాఁడు.

తండ్రివలె విజయరాఘవనాయకుఁడు కృతిభర్త, కృతికర్త. ఈతఁడు తెలుఁగున నాటకములు, ద్విపదలు, చౌపదలు మున్నగునవి, పెక్కు రచించినాఁడు. ఈతని రచన లీక్రిందివానినిఁ జిత్తగింపుఁడు.

### నాటకములు.

1. రాజగోపాల విలాసము, 2. చెంగమలవల్లీపరిణయము, 3. గోవర్ధనోద్ధరణము, 4. రతిమన్మథవిలాసము, 5. రాసక్రీడానవనీతచోరము, 6. పారిజాతాపహరణము, 7. రుక్మిణీకల్యాణము, 8. రాధామాధవము, 9. ధనాభిరామము, 10. సత్యభామావివాహము, 11. ఉషాపరిణయము, 12. దక్షిణద్వారకాస్థలవర్ణనము, 13. కాళియమర్దనము,

14. రఘునాథాభ్యుదయము, 15. ప్రహ్లాదచరిత్రము, 16. పూతనాహరణము ? 17. విప్రనారాయణ చరిత్రము, 18. సముద్రమథన నాటకము, 19. కృష్ణవిలాసము, 20. మోహినీవిలాసము, 21. జానకీకల్యాణము, 22. ప్రణయకలహము, 23. కంస విజయము.

ద్విపదలు.

1. పాదుకాసహస్రము, 2. మోహినీవిలాసము, 3. రఘునాథనాయకాభ్యుదయము.

1. గోపికాగీతలు, 2. భ్రమరగీతలు, సంస్కృతమునుండి తెలిఁగించినవి.

చౌపదులు.

1. ఫాల్గుణోత్సవము రగడ – చౌపది

దండకములు.

1. రాజగోపాల దండకము.

ఇంకను, వేడుకోలు విన్నపములు, దరువులు, ఏలపాటలు, సంకీర్తనలు, కొఱవంజి, మొదలగు యక్షగానములు, నాట్యము సేయునప్పుడాయా యభినయనములకు రాగములకు ననుకూలములగు నాట్యములు నీతఁడు రచియించినట్లు ప్రహ్లాదనాటక పీఠికచేఁ దెలియుచున్నది.

పై గ్రంథములలో ననేకములు మనకు లభ్యము గాకుండుట, యాంధ్రవాఙ్మయమునకు, నందు ప్రత్యేకముగ దక్షి

ణాంధ్రవాఙ్మయమునకుఁ దీరని లోపము. ఈ క్రింది వివరించిన గ్రంథములు తంజావూరు పుస్తకాగారమున నున్నవి.

1. రఘునాథనాయకాభ్యుదయము, ద్విపద, 2. రఘునాథ నాయకాభ్యుదయము, నాటకము, 3. కాళియమర్దనము - నాటకము, 4. ప్రహ్లాద చరిత్ర, 5. పూతనాహరణము. 6. విప్ర నారాయణ చరిత్రము.

పై వానిలో రఘునాథాభ్యుదయము రఘునాథనాయకాభ్యుదయము (ద్విపద నాటకములును[1]) విప్రనారాయణ చరిత్రమును నేడు ముద్రితములైనవి. ముద్రితమైన మూఁడు కృతులును, చారిత్రకముగ నేకాక సారస్వతదృష్టిని ముఖ్యములైనవి.

రఘునాథాభ్యుదయము.

ఇది తన తండ్రియగు రఘునాథనాయకుని గూర్చి రచియించిన యక్షగాన నాటకము - శృంగారరస ప్రధానమగు నీ నాటకమున రఘునాథనాయకుని చిత్రరేఖ యను వనిత మోహించుట, చిలుకచే రాయబార మంపుట, వారి సమాగమము వర్ణితములైనవి - మఱియు నందు రఘునాథరాయల కాలమున ప్రవర్తిల్లిన విద్యాగోష్ఠీ వినోదములు-రామభద్రాంబ, శుకవాణి, కవయిత్రుల, సమస్యాపూరణములు, రాజకీయముగా నాదాయవ్యయ. విచారణలు, కమ్మవారి వక్కణ, మున్నగునవి చక్కఁగ చిత్రింపఁబడినవి.

1. పై రెండు గ్రంథములును సుప్రసిద్ధాంధ్రదేశీయచారిత్రకపరిశోధకాచార్యులును ప్రశస్త విద్వాంసులు నగు డాక్టరు నేలటూరి వేంకటరమణయ్యగారివిపులపీఠికలతో తంజావూరి సరస్వతీ మహాలు పక్షమున ప్రకటితములైనవి.

### రఘునాథనాయకాభ్యుదయము.

ఇదియు పై విధమున రఘునాథనాయకుని చరిత్ర వర్ణించునదియే. ఇది ద్విపద కృతి. ఇందు మొదటి రెండాశ్వాసములును సమగ్రముగను, మూఁడవ యాశ్వాసమున కొంతగ నున్నది. ముద్రితప్రతిలో (1 – 684, 2 – 484, 3 – 912) 2081 ద్విపదపంక్తులు గలవు. గ్రంథమింక నెంత యుండెనో తెలియ రాదు. ఈ గ్రంథరచనావిశేషమిది.

### నాయకాభ్యుదయ రచనలు.

తమ తండ్రుల పూర్వవృత్తాంతమును దెలుపు నిట్టి రచనలకు రఘునాథనాయకుఁడే మార్గదర్శకుఁడు. అతఁడు తనతండ్రియైన అచ్యుతప్పనాయకుని చరిత్రము, అచ్యుతాభ్యుదయ మను పేర రచియించి యున్నాఁడు. అది ద్విపదకృతియే.

రఘునాథుఁడు ద్విపద నలచరిత్రములో:

" భూషించి యచ్యుతాభ్యుదయప్రబంధ
నిర్మాణమున మాకు నిఖిలదేశముల
నిర్మల సత్కీర్తి నెగడు గావునను
యటువలె ద్విపదకావ్యము వేఱె యొకటి
ఘటియించి సత్కీర్తిఁ గైకొందునంచు
మదినెంచి"

యని చెప్పి యున్నాఁడు. అచ్యుతాభ్యుదయము నేఁడు లభ్యముకాలేదు. విజయరాఘవుని కాలమున దానిని సభలో చదివి వినిపించినట్లు పై గ్రంథమువల్లనే మనకు తెలియుచున్నది. మఱియు, రఘునాథరామాయణమునందు సంగీతసుధ యందు పేర్కొనఁబడినది. దీని ననుసరించియే ద్విపదకృతిగా "రఘునాథ

నాయకాభ్యుదయము" అను పేర విజయరాఘవనాయకుఁడు రచియించి యున్నాఁడు. విజయరాఘవుని పుత్రుఁడగు మన్నారుదేవుఁడును, తన తండ్రి చరిత్రమును "విజయరాఘవనాయకాభ్యుదయము" అను పేర రచియించినట్లు "హేమాబ్జ నాయికాస్వయంవరము" భరత వాక్యమున నిట్లు చెప్పఁబడినది.

"ఇవ్విధంబున......విజయరాఘవభూపాలక ప్రియపుత్రుండును......విజయరాఘవాభ్యుదయాది ప్రబంధ నిబంధన చాతురీ ధౌరేయుండును,అతులిత పితృభక్తిగురుభక్తిభాగధేయుండును మహితానుభావుండగు మన్నారుదేవుండు హావణించిన హేమాబ్జనాయికాస్వయంవరము అను నాటకము......

(తంజావూరి పుస్తక సూచిక, M.675, పుట 277-278)

ఇది రాజగోపాలస్వామి కంకితమై ప్రశస్తరచనతో నున్నది. ఇందు తంజావూరి కోట యందు గల భవనములు రఘునాథరాయని విజయవిశేషములు దినచర్య మొదలగునవి సంపూర్ణముగ వర్ణితములైనవి.

విప్రనారాయణ చరిత్ర;

పన్నిద్ద ఱాళ్వారులలో తెనుఁగు వారికి ప్రియతముఁడైన తొండరడిప్పొడి యాళ్వారుల చరిత్రమును ప్రశస్తమైన యక్షగాన నాటకముగ విజయరాఘవనాయకుఁడు సంతరించి యున్నాఁడు. ఈ కథను ప్రబంధరూపమున తొలుత తెలుఁగున వెలయించినవాఁడు, భారతకవిత్రయములో పరిగణితుఁడును నెట్టూరెగ్గడ వంశీయుఁడునునగు చదలువాడ మల్లనకవి. ఈతని విప్రనారాయణ చరిత్రము ముద్రితమై ప్రచారమున నున్నది.

దీని తరువాత యావదాంధ్రదేశమున విశేషముగ వ్యాప్తిని గన్నది సారంగుతమ్మయ్య రచించిన "వైజయంతీ విలాసము" అను ప్రబంధము. కాని విజయరాఘవనాయకుని యక్షగానకృతి వీని రెండింటిని కొన్నిపట్టుల మించియున్నది. ఇదియు నేడు ముద్రితమైనది[2] గాన, ఈ గ్రంథ విమర్శనము వేఱొకచోట ప్రత్యేకముగ గావింతును. చారిత్రకాభిమానులును సారస్వతాభిమానులును, పై రెండు గ్రంథములను పఠింపవలసి యున్నది.

అముద్రితకృతుల వివరము :

అముద్రితములై యలభ్యములగుచున్న వానిలో ప్రతి గ్రంథము మొదలు నీక్రింది పద్యము కానవచ్చుచున్నది. వాని కిది "నాంది" యని చెప్పనొప్పును.

సీ. భోజకన్యాముఖాం - భోజరాజమరాళ!
సత్యాఘనస్తన - స్తబకభృంగ!
జాంబవతీవిలో - చనచకోరశశాంక!
మిత్రవిందాతటి - న్మేఘరూప!
భద్రవశావశ - భద్రదంతావళ!
వరసుదంతామనో - వనమృగేంద్ర!
లక్షణారూప కలా - పినీపర్జన్య!
భానుసుతా - లతాపారిజాత

1. ఆంధ్రసాహిత్య పరిషత్తు (కాకినాడ) వారి పక్షమున క్రీ. శ. 1940లో ఈ గ్రంథము విపులమైన పీఠికతో ప్రకటితమైనది. పీఠికాకర్త నిడుదవోలు వేంకటరావు ఎమ్. ఏ.

2. తంజావూరి సరస్వతీమహాలువారి పక్షమున, అచ్చటి పండితులగు శ్రీఅ. మహాదేవశాస్త్రి, శ్రీ విఠలదేవుని సుందరశర్మగార్ల సంపాదకత్వమున వెలువడినది.

గీ. షోడశస్త్రీసహస్ర చ - క్షుఃప్రసార
హారసార మసార మో - హనశరీర!
విజయరాఘవ భూపాల - భజనలోల!
కేలుమోడ్చెద రాజగో - పాల ! నీకు.

పై రచనము లన్నింటిలోను ప్రహ్లాద చరిత్రమను యక్షగానము చివరకృతి - ఈయక్షగానము నే విజయరాఘవనాయకుని కృతులన్నియు పేర్కొనఁబడినవి - మఱియు నిందు పై సీసపద్యము లేదు - గ్రంథములో నిది చాటుకావ్యముగా పేర్కొనఁబడినది - (సంఖ్య 541)

పూతనా హరణము.

ఇందు శ్రీ కృష్ణుఁడు పూతనను సంహరించుట వర్ణితము. గ్రంథారంభమున పన్నిద్దఱాళ్వారుల స్తుతి గలదు - దీనివలన విజయరాఘవుని వైష్ణవభక్తి పరిస్ఫుట మగుచున్నది. ఇందు కైవారగద్యలో నాతఁడు "చతుర్విధ కవితా నిర్వాహక సార్వభౌమ బిరుదాంగద విరాజమాన చరణాంభోజు" అని వర్ణితుఁడైనాఁడు. (సంఖ్య 554):

కాళియ మర్దనము.

శ్రీ కృష్ణుఁడు కాళియుని మర్దించుట యితివృత్తము. ఇందు విజయరాఘవ నాయకుఁడు కనకాబ్జనాయిక గన్న చిన్నికుమారుఁడుగా వర్ణితుఁడైనాఁడు. (సంఖ్య 500,)

ఈతని యాస్థానమునందు విలసిల్లిన కవులు కవయిత్రులు. కవులలో తొలి పేర్కొన దగినవాఁడు.

1. చెంగల్వ కాళ కవి.

ఈతనిగూర్చి యీవఱకుఁ దెల్పితిని.

2. కోనేటి దీక్షిత చంద్రుఁడు.

ఈతడు "విజయరాఘవకల్యాణము" అను నాటకము నకుఁ గర్త- రాజగురువగు శతక్రతు చతుర్వేది శ్రీనివాసతాతాచార్యుల శిష్యుఁడు. రామానుజాచార్యతనయుడు-విజయరాఘవ నాయకునిచేత నగ్రహార, తారహారాది బిరుదవాద్య పారితోషికములందినమనీషి- ఈ నాటకము "కందళద్రసగర్భసందర్భంబులు హావణించునట్లు" రచియించెను-ఇది యముద్రితము (సంఖ్య 602.)

3. పురుషోత్తమ దీక్షితుఁడు

ఈతడు "తంజాపురాన్నదాన మహానాటకమును" రచియించినకవి. తంజావూరినాయకరాజు లన్నదానమునకు ప్రసిద్ధిఁ జెందినవారు. "నిరతావారితాన్నసత్రసంతోషితపంచాసత్సహస్రభూసుర" యని రఘునాథనాయకుని వాల్మీకిచరిత్ర గద్యయందు గలదు. విజయరాఘవనాయకుఁడల్లే ప్రతిదినము నేఁబది వేలమంది బ్రాహ్మణులకు నన్నదానము చేసినదాత. ఈ గ్రంథమందచ్చటచ్చట పాత్రలసంభాషణములలో నఱవభాష ప్రయుక్తమైనది. దీనికి సత్రమఠులని నామాంతరము. అముద్రితము సంఖ్య (529) విజయరాఘవనాయకుని యన్నదానప్రశస్తి కాళకవి రాజగోపాలవిలాసములో (1-81) వర్ణించియున్నాఁడు.

5. కామరసు వేంకటపతి సోమయాజి

ఈతఁడు విజయరాఘవ చంద్రికావిలాసమను నాటకమును రచించిన మహాకవి. విజయరాఘవపట్టభద్రుని పట్టపు

కవి. ఈతఁడీ నాటకమును, "విజయరాఘవచంద్రుని చంద్రికా విహార శృంగారలీలా విలాసంబు కవిజిహ్వారంగ శృంగాటకంబుల థాటి సల్పుభారతి ఘోటకంబుగా" శృంగారరస గర్భా విర్భావంబునకు గర్భోటకంబుగా పావణించి యున్నాఁడు.

ఈ నాటకమునుండి చోళ దేశవర్ణనమును, విజయరాఘవనాయకుని వర్ణనము నుదాహరించుచున్నాఁడను. దీనివలన యందలి కవితాశైలి యెఱుకపడును.

చోళదేశ తంజాపుర వర్ణన – రగడ

కవులెంతురు చోళదేశము దివ్య – కావేరీవారి ప్రకాశము
నవరత్నములున్న కోశము సుర – నాయకరాజ్యసంకాశము
చెఱుకు రాజనంపుఁబైరులు కాపు–సేమముగలిగినయూరులు
తిరముగాఁ బ్రవహించు నేఱులు చోళ–దేశంబున వెయ్యాఱులు
ఆరాజ్యమునకు మంజీరము అల్ల – అమరావతి గన్నసారము
భూరమణీమణిహారము తంజా – పురము సంపదలకొటారము
నవరత్నంబులపేటలు దివ్య – నారికేళంబుల తోఁటలు
సవరణ సేసిన కోటలు పీట – సరసులు నూటాఱుకోటులు
వలరాయనిమీఁది యేలలు చాల – వర్ణింప నేర్చిన బాలలు
విలసిల్లు నాటకశాలలు అందు – వింతవింతలు కృష్ణలీలలు
పరులనుగెల్చిన పౌజులు మెచ్చ – పాలింతురు దినరాజులు
సరిలేని విద్యాభోజులు పీట – సడిసన్న రాజాధిరాజులు.

విజయరాఘవనాయకుని వర్ణన

ద్విపద

శ్రీరాజగోపాల – సేవచేఁ జాల
పేరుఁగాంచిన తేఁడు – బిరుదుమన్నీఁడు

లక్షణాన్వితుఁడు క - ళావతీసుతుఁడు
దాక్షిణ్యశాలి యు - త్తమరాజమౌళి
రణముల జగజెట్టి - రఘునాథుపట్టి
గుణరత్నముల దీవి - గురుజనసేవి
బహుదానపరుఁడు భూ - పాలశేఖరుఁడు
సహజగుణస్ఫూర్తి - సర్వజ్ఞమూర్తి
రతులకు రతిరాజు - రాజుల రాజు
వితరణగుణశౌరి - విభవజంభారి
జగదుపకారి వై - ష్ణవమతోద్ధారి
తగవులవీడు చిం - తామణిజోడు
నీతికిమాంధాత - నియమసంధాత
జాతివార్తల మేటి - శౌర్యకిరీటి
సరసుండు నెఱజాణ - చక్కనివాఁడు
పరమవైష్ణవుల చే - పట్టు కుంచంబు
బాహు విక్రమశాలి - భరతకోవిదుఁడు
సాహిత్యభోజుండు - సంగీతవేది
కోరినవారికి కొంగు - బంగారు
చేరువమేరు వా - శ్రిత వర్గమునకుఁ
పేదల పాలింటి - పెన్నిధానంబు
వేదకోవిదులకు - వెలలేనిసొమ్ము
పలికిబొంకని రాజు - పరమవివేకి
నిలుకడగలవాఁడు - నిత్యాన్నదాత
పట్టభద్రుండు కృ - పాసముద్రుండు
చుట్టాలసురభి రా - జులమేలుబంతి
వరశరణాగత - వజ్రపంజరుఁడు

నరులపాలింటి పు - న్నమ చందమామ
ఏకవీరుఁడు జగ - దేకవదాన్యుఁ
డాకారమన్మథుం - డసమసాహసుఁడు
మానినీనూతన - మకరకేతనుఁడు
భానుసమానుండు - పరతత్త్వవేది
అనుమానమున లేని - యావనమాలి
చనవరి యిల్లాలి - చనుబాలుగ్రోలి
పెరిగిన యన్న గో - భిల మానికన్న
పరతత్త్వరుచిఁగన్న - పాయంపుమిన్న
విజయరాఘవశౌరి - విద్యావిహారి
భుజబలకంసారి - పూర్ణసంసారి
అన్నిట నవధాని - యారాజధాని
మన్ననతో నేలు - మహి మేలుమేలు.

(అముద్రితము - సంఖ్య M. 686 తంజావూరి పుస్తక భాండాగారము) సంఖ్య 603

—: పసుపులేటి రంగాజమ్మ :—

రంగాజమ్మకు రంగాజీయని నామాంతరము. ఈమె యింటిపేరు పసుపులేటివారు. తండ్రి వేంకటాద్రి. తల్లి మంగమ్మ ఈమె విజయరాఘవనాయకుని యాస్థానకవయిత్రియై యీక్రింది గ్రంథములను రచించినది.

1. మన్నారుదాసవిలాసము- (ప్రబంధము.) 2. మన్నారుదాసవిలాసము-(నాటకము.) 3. ఉషాపరిణయము-(ప్రబంధము.) 4. రామాయణ సంగ్రహము. 5. భారత సంగ్రహము. 6. భాగవత సంగ్రహము

ఇంతియేగాక సంగీతమున నీమె లలితఫణితిని మృదురసాస్పదములగు పెక్కుపదములు రచియించినట్లు, తన యుషాపరిణయావతారికయం దిట్లు చెప్పినది. " ఇంపుమీర నేనును శృంగారరసంబులఁ జెన్నుమీరు మన్నారుదాసవిలాసంబు వినిపించుచున్న సమయంబున

సీ. వేంకటేంద్రుని పుత్రి! వినుత సద్గుణధాత్రి!
ఘనయశోరాజి! రంగాజి! వినుము.
మాధుర్యమున మించు మన్నారుదాస
విలాస ప్రబంధంబు లలితఫణితిఁ
గావించి, మిగులశృంగారంబు గన్పట్టఁ
బదములు మృదు రసాస్పదములగుచు
రాణింప రచియించి, రామాయణంబును
భాగవతంబును, భారతంబు
సంగ్రహంబుగ రచియించి సరసరీతి
మమ్ము మెప్పించితివి చాల నెమ్మదనరఁ
బరగ హరివంశమున నుషాపరిణయకథ
తెనుఁగుఁ గావింపుమిక నీవు తేటగాఁగ.

పైకృతులలో. మన్నారుదాసవిలాసప్రబంధమును, మన్నారుదాసవిలాసనాటకమును. (వీనిలో మన్నారుదాసవిలాసనాటకముతప్ప తక్కినవి రెండును నముద్రితములు.) ఉషాపరిణయముమాత్రమే మనకు లభ్యములగుచున్నవి. పైపదములు కూడ మనకు లభ్యముకాలేదు. కాని యీామె తన కృతులలో వాని నచ్చటచ్చట కూర్చుకొనియుండుటచే నుదాహరణమునకు మాత్రమే మనకు దొరికినవి.

రంగాజమ్మ కృతులనుగూర్చి యెఱుంగుటకు ముందు నామె విద్యావైదుష్య మెఱుఁగఁదగినది. అది ఆమె గ్రంథముల కడపటఁగూర్చిన గద్యయే తెలుపఁగలదు. దానినిట నుదాహరించెదను

"ఇది శ్రీమద్రాజగోపాలకరుణాకటాక్షవీక్షణానుక్షణ ప్రవర్ధమానసారస్వతధురీణయు, విచిత్రతరపత్రికాశతలిఖిత వాచికార్థావగాహనప్రవీణయు, తత్ప్రతిపత్రికాశతస్వహస్త లేఖనప్రశస్తకీర్తియు, శృంగారరసతరంగితపదకవిత్వమహనీయ మతిస్ఫూర్తియు, అతులితాష్టభాషాకవితాసర్వంకషమనీషా విశేషవిశారదయు, రాజనీతివిద్యావిశారదయు, విజయరాఘవ మహీపాలవిరచితకనకాభిషేకయు, విద్వత్కవిజనస్తవనీయ వివేకయు, మన్నారుదాసవిలాసనామ మహాప్రబంధనకృతలక్షణయు, మహనీయరామాయణభారతభాగవతకథాసంగ్రహ విచక్షణయు, పసుపులేటి వేంకటాద్రి బహుజన్మతపఃఫలంబును, మంగమాంబాగర్భశుక్తిముక్తాఫలంబును, రంగద్గుణకదంబ యునగు రంగాజమ్మవచనరచనాచమత్కృతిం జెన్నుమీఱు ఉషాపరిణయ ప్రబంధమునందు తృతీయాశ్వాసము."

పైగద్యవలన నీమె రాజగోపాలదేవుని దయవలన కవయిత్రి యయ్యెననియు, వాచకత్వమున నేగాక, చిత్రవిచిత్ర శత లేఖనీవిద్యయందు ప్రవీణురాలనియు, ఎనిమిదిభాషలలో కవనమల్లఁగల నేర్పరియనియు, పదకవిత్వమున ప్రౌఢిమగన్నదనియు, రాజనీతి నెఱిఁగిన రమణియనియు, సరసశృంగార పదకవితయందు జాణయనియు, విజయరాఘవమహీపాలునిచే కనకాభిషేకమను (కనకాభిషేకము చేయువిధానముగూర్చి చూడుఁడు : శృంగార

శ్రీనాథము : గౌరవముచేయువ్యక్తిపై బిందెలతో బంగారు నాణెములు స్నానముచేయునట్లు వెలువరింపవలెను. క్రిందపడిన యా నాణెములన్నింటిని తక్కినవారందఱకును పంచిపెట్టవలెను. ఇది కనకాభిషేకము. ఇందుకవికి గౌరవమేగాని కనకము లభింపదు) మహాగౌరవమునుబొందిన విద్వత్కవయిత్రి యనియు తెలియుచున్నది.

కనకాభిషేకగౌరవము బొందుటయనునది సామాన్య విషయముగాదు. లోకోత్తర ప్రతిభాశాలియగు మహాకవికిగాని, విద్వల్లోకమకుటాయమానుఁడగు మహావిద్వాంసునికిగాని చేయఁదగిన మహాగౌరవములలో కనకాభిషేకమే ప్రధానమైనది. విజయనగర సామ్రాజ్యాధీశుఁడగు దేవరాయనిచే శ్రీనాథ మహాకవి యీ సత్కారమును గాంచినవాఁడు. వాఖ్యాతృచక్రవర్తి మల్లినాథ సూరి సర్వజ్ఞసింగ మహీపాలునిచే నీసత్కారమును పొందినవాఁడు. కాని యింతవఱకు స్త్రీలెవ్వరును నిట్టి గౌరవమును బొందినట్లు మనకు తెలియుటలేదు.

కవయిత్రియగు రంగాజమ్మ యిట్టిగౌరవమును బడయుట యాంధ్రలోకమును, నందు ముఖ్యముగా నాంధ్రమహిళామండలియు గర్వింపఁదగిన విషయము. అంతియేకాదు; ఆంధ్రవాఙ్మయ చరిత్రమున నిది సువర్ణాక్షరములతో లిఖింపఁదగినది.

గద్యలో 'అతులితాష్టభాషాకవితాసర్వంకషమనీషా విశేషవిశారద' అనునవి నీమెయెడల సార్థకమే. అష్టభాషలనఁగా 1. సంస్కృతము. 2. ప్రాకృతము. 3. శౌరసేని 4. మాగధి 5. పైశాచి 6. చూళిక 7. అపభ్రంశము 8. తెలుఁగు అనునవి

ఈ భాషలయం దీమె కవితావైదుష్యము తెలుపుట మన్నారు దాసవిలాసనాటకము నుండి యీ క్రిందివాని నుదాహరించు చున్నాఁడను.

సంస్కృతము

ఔదార్యమంగనృపభంగవిధాన ధుర్యమ్
శౌర్యంచ ధైర్యమపి శౌర్యపలాలనీయమ్
రూపంచ పంచశరవీరవిలోభనీయమ్
యస్త్యాహో విజయరాఘవ సార్వభౌమ.

ప్రాకృతము

భద్ద దేయు పుణేతుహ చంపయరత్నప్పయేన సంచాళో
హరిద్దణం యితడుజ్జ్వల మందిర విహాయీయరాయ గోపాళో

శౌరసేని

విదదయసో వత్తదిసో జయయిసుహుద్దణ్ణదోయేసో
కణ్ణపదబత్తిసీళో మణ్ణరుదాసో మహీపాళో.

మాగధి

పుశుపశరాసన శరిసే రూవేణ హరియ్య మహిమాయే
దాణేహంరాహేయే వియయి రహునాహశామి సంతాణే.

పైశాచి

సొవజ్యోగునవంతో బమ్మనహచ్చాను పూళన్దమహానానో
అయ్యవెన్నుసమానో ళోకవిళోకస్స పున్నెనిమచందో.

చూళిక

ఖమళవిలోచనమధనే యాచకఝుణ ధౌవ్యపాదపో యేసో
భాహాభళభళపద్దా ఆరవికారయ వియయరాఘవో వియయ.

అపభ్రంశము

పుణు కావిగోడి తుంహో డత్థూణ మణేన్నరూపు అసమాణు
దూయి యనిబ్భరవిరహ పుహావు మణ్ణారుదాసు భూపాలు.

తెలుఁగున నామె గ్రంథకర్త యేగావున నుదాహరణ మీయ లేదు. సంస్కృతపద కవిత్వమునందీమె చతురయనుటకు నీమెరచించిన చూర్ణిక రూపకతాళవర్ణములు మొదలగునవి తెలుపును. ఈమెకు సంస్కృతవ్యాకరణమున మంచిప్రవేశము గలదనుటకు, మన్నారుదాసవిలాసమున నొకచో నీమెవ్రాసిన వ్యాకరణశాస్త్రప్రసంగమే యుదాహరణము. గ్రంథవిస్తర భీతిచే వాని నుదాహరింపలేదు.

మన్నారుదాసవిలాసనాటకమున నీమె ప్రతిభ లోకజ్ఞత హాస్యరససంవిధానము - సంగీతజ్ఞానము నిండారవెల్లి విరియుచున్నది. ఈ నాటకమునందు పాత్రోచితభాష వాడఁబడుటచే నిదిమఱియు రసవత్తరమై హాస్యమననిదియని నిరూపించుచున్నది. ఇందు కొన్ని యుదాహరణములు.

1 ముహూర్తము నిర్ణయించుటకు రాజగారియాస్థానమున నున్న గణితజ్ఞుల చర్చలు,ఒకరిపై నొకరివాక్యములు సంభాషణ :-

భైరవజ్యోస్యులు : మంచనభట్లుగారు పంచాంగం విప్పుడా ?

మంచనభట్లు : భైరవజ్యోస్యులు. నేరనిమాటలె ఆడుదువు. చక్కంగా అశ్వినిభరణి కృత్తికలు గురుతెరుగవు నీకు పంచాంగం వ్రిప్పేదిన్నా నీభవిష్టికి.

భై : మంచనభట్లుగారికి మూలానక్షత్రమే మాటాడకమునుపే మూలం రేగుతూఉన్నది.

మం : ఓరి భైరజ్యోస్సిగా! తిధివారనక్షత్రాల్లలో నొకటి గురు తెరుగవుగదా! పంచాంగమనంగా నేంటిరా ?

భై : మంచనకు ముక్కుమీదనే వుండునుకోపం. అమావాస్య నాడు గ్రహణమనిన్నీ, ఆగ్నేయస్పర్శ అనిన్నీదబ్బరలే వ్రాస్తివే! మేముగ్రహాస్ఫుటంచేసి గ్రహణము లేదంటిమే.

మం : నీవు పోచన సోమయాజులవారింట మొగవాండుపుట్టునని ప్రశ్న జెప్పి యేకాతురప్రయోగం చేయించుకవస్తివే!

భై : నీవు బుచ్చావధానికొడుకు బుచ్చిగాండు పదహారోయేంట పల్లకియెక్కునని జాతకంవ్రాస్తివే – ఇదిగో బిచ్చంయెత్తుక తిరుగుచున్నాండె ?

మం : నేఫలభాగం వ్రాసినవారు పదివేలమంది పల్లకిపదస్థులు నీకేంతెలుసు పోరా.

మధ్యస్థులు : వోయి, చాలించరోయి, మీ జగడాలు, నగరి వారుముహూర్తం నిర్ణయించమంటే ఏషాగాధా లాడుచున్నారు.

## పురోహితులమాటలు

కొండుభట్లమాట - అవునోయి యల్లుసోమయాజులు, నూరు తరాలనుంచి యీ యింటికి తగువైన పురోహితుండ నేనుండగా నీవెవ్వండికొడకవు నా స్వాతంత్ర్యం కొంగుముడిరాక తీసుకుపోయే టట్టుగా ?

యల్లుసోమయాజులు : ఏమోయి కొండుభట్లా! మాతాతకు చవ్వాపునాయనివారు పాకెన సంభావన కట్టడచేసివుండగా నీవెవ్వండవోయిఅపహరించుక పోయేటట్టు. మా అన్నకొడకవా! ముత్తైదువుల మాటలు

యల్లమ్మ : అవునమ్మేటిమ్మక్క ! నాకువక్క బ్రద్దా వకటికొదవా ? చాలుచాలు ; నిన్నమావారు సుక్కురారం సంతలో పిండికూరకంచున్నా గానుగబిండిదెచ్చేరు. నోరు మెదలించవలె నంచున్నా

తిమ్మక్క : పొరుగింటి తిమ్మావధానిపెండ్లాం వీరమ్మ పాటలు పాడుతూన్నది. అంటుకొని నీవున్నా పాడ్రాదమ్మో.

యల్లమ్మ : ఇదేందో నీవు నాగపసానిలా పెత్తనంచేసుకు వుండే దానవున్నా కడమవారు పాటలుపాడేవారున్నా.

తిమ్మక్క : వోశమ్మా - మాయింటిఆయన యెందుకో యేవేళ లమ్మంచున్నారు. పక్కడంతా మొగవారేవున్నారు. నీవుధవళంయెత్తు నేనుంగూడాపాడేగాని,

ఈవిధముగా నించుమించు గ్రంథమంతయు నుదాహరించ వలసి యుండును. ఈ నాటకమున సున్నితమగు జాతీయమగు హాస్యము ప్రవచింపఁబడినది. ఇది రచయిత యపూర్వరచనా సామర్థ్యము తెలియఁజెప్పను. ఇక యీామె కృతులు.

## ఉషాపరిణయము

ఇది ప్రబంధము- ఇందుషానిరుద్ధుల వివాహము వర్ణితమైనది. మూఁడాశ్వాసములు సమగ్రముగను, నాలుగవయాశ్వాసములో కొంతభాగము గలదు. అముద్రితమగు నీ గ్రంథము తంజావూరి పుస్తకశాలలో (140 సంఖ్య) గలదు. ఇందులో విజయరాఘవనాయకుని వంశావళి సంగ్రహముగాఁ గలదు. చక్కనికవిత్వము. శృంగారరసప్రధానము.

## మన్నారుదాసవిలాసము (నాటకము)

దీనిని 1926 లో నాంధ్రసాహిత్యపరిషత్తు (కాకినాడ) వారు ప్రకటించినారు. వారిప్రకటనమువలననే, రంగాజమ్మ వృత్తాంతము కొంతయైన యాంధ్రలోకమెఱిఁగినది. అయినను దీనినింకను మనసాహితీ విమర్శకులు చక్కఁగా చదివినట్లు కానరాదు.దీనినిగూర్చికీర్తి శేషులు కళాప్రపూర్ణులు జయంతిరామయ్య పంతులవారు 'తమ అధునాతనాంధ్రవాఙ్మయవికాసము' న కొంతవ్రాసియున్నారు. ఇది యక్షగానమునుండి నాటకముగా నాడుపద్ధతిని వ్రాయఁబడినది. విపులవిమర్శతో తిరిగి ముద్రింపఁదగిన ప్రశస్తకృతి. నేను ముందుదాహరించిన విందునుండియే. ఇది విజయరాఘవనాయకకాంతిమతీ వివాహమునుఁదెలుపు నితివృత్తముగలది.

## మన్నారుదాసవిలాసము - (ప్రబంధము) - చిత్రకథ

### —: సౌందరి :—

రంగాజమ్మరచించిన యీకృతితంజావూరి పుస్తకశాలలో కలదు. కాని, ఈగ్రంథమే మఱియొక కవయిత్రి 'సౌందరి' అనునామె దీనినిరచించినట్లుగా నందలిగద్యములు కూర్పఁబడి "అల్లాడ విజయ సింహభూపతివిలాసము" అనుపేర మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకాగారముననున్నది. దానిసంఖ్య 786. ఇది తాళపత్ర గ్రంథమే. వ్రాఁతనవీనముగ స్ఫుటముగనున్నది. ఒక్కొక్కదాని యందు 14 పంక్తులుగలవు. ఈ గ్రంథము చదివినవారి కిది యొక కూటసృష్టియని తోఁచకమానదు. ఏలననగా రంగాజమ్మ గద్య యందలి పేళ్లుమాత్రమే యిందు మార్పుచెందినవిగాని తక్కినవి యన్నియు సమానమే. ఇప్పుడు ముద్రితమైన మన్నారుదాస విలాస నాటకములోని పద్యములిందున్నవి. కాబట్టియిది రంగాజమ్మకృతియే, "సౌందరి" అనునామె యెట్లోసంగ్రహించి (ఆమెయు సంగీతసాహిత్యములు నేర్చినదికాదగును) గ్రంథకర్తృత్వము నభిలషించి, దీనినిట్లు మార్పించియుండును. రంగాజమ్మ గద్యలో "విజయరాఘవ" అని యున్నచో నిందు "విజయ సింహ భూపతి" అచట "పసుపులేటి" యన్న నిచట "రాచ వేటి" -అచట "మంగమాంబ" ఇచ్చట "మాక్తికాంబ." ఇత్యాదిగావెలసినవి. ఈ మార్పులు కేవలము పేరులలోనే యుండుటచే నొక్కొక్కపుడు యతిదోషములుగూడ గమనింప బడియుండలేదు. ఉదాహరణమునకు :—

క. ధీరాజుల చనవీరా
   వీరాయితకేళి నిన్ను వెలఁది గొనెనురా

నేరాలకేమి రారా
కారాపులు మాని విజయభూపతి ధీరా!

ఇట్లుగా 14 వ పత్రమునగలదు "రారాపులు మాని విజయరాఘవ ధీరా" అనిగదా యుండదగినది. కావున నీకృతి రంగాజమ్మ దేయనుట నిక్కము.

అముద్రితమగు నీ గ్రంథమునుండి కవిత్వశైలిని తెలియుటకు 'వసంతవర్ణన' నుండి కొన్నిపద్యము లుదాహరించుచున్నాడను.

మ. ఘరగన్ చైత్రుఁడు నవ్యసూత్రలతికా పాణిగ్రహం బందుచున్
మెఱయన్ మల్లికలుగ్ తరువ్రజములు న్మెచ్చుందఁగా నిత్తరిన్
తెఱగొప్పన్ నిడి పాణిపల్లవములన్ దీవ్యన్నవామోదముల్
నెఱయన్ దాల్చిన సేసఁ బ్రాలనగ గన్పించెన్ ప్రసూనావళుల్

క. బాహుబలశాలి మరుఁడు
త్సాహంబున జగముగెలువ తరలెడుచో స
న్నాహంబు దెల్పు తత్ ఘన
కాహళ రావములన నళికధ్వను లెసగెన్.

గీ. కొమరుమీఱిన నవపల్లవముల కాంతి
గాణమాసాంధ్యరాగంబు కరణిమించ
నపుడు గనిపించె నందందు నందముగను
తారకంబు లనంగను కోరకములు.

క. తరుణీజన మానమద
ద్విరదంబుల మదమడంప దివురుమరునికిన్
దరమగు రత్నాంకుశముల
మురువుగ గనుపట్టినపుడు మోదుగమొగ్గల్

గీ. మలయనిలయానిలుం డను మంత్రవాది
యచట భ్రమరాక్షసరము ద్రిప్పుచును మఱియు
పొసగు కుసుమ పరాగంబు భూతి జల్లి
సల్పె యువతి మానగ్రహోచ్చాటనంబు.

ఈమన్నారుదాసవిలాసముననే రంగాజమ్మ యొకదండకముగూడ విజయరాఘవునిపేర రచించినది. అదియు పైవిధముగామార్పు చెందినది. అల్లాడవిజయ సింహభూపతిపై "మోహిని" అనునామె మగులుగొనుట, పొందుట యిందలివిషయము ఇదియు మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకశాలలో "మోహినీదండకము" అనుపేరుగలదు. సంఖ్య 2001 మన్నారుదాసకావ్యము, నాటకము రెండును విజయరాఘవనాయకుని చరిత్రాత్మకములేగాని వేఱుగావు. రంగాజమ్మ కృతు లిట్లితరుల కృతులుగా మార్పుచెందు నవకాశమున్నదనుటకు మఱియొక వృత్తాంతముగూడ నిటఁ దెల్పెదను.

"విజయరాఘవ నాయకుఁడెల్లప్పుడును నీమెతో (రంగాజమ్మతో)నానందించుటచూచి, యాతనిపట్టమహిషి యాగ్రహము నాపుకొనఁజాలక యొకదూతికమూలమున దూషణోక్తులతో నొకవార్తనంపెనట! దానికి విదుషీమణియగు రంగాజమ్మ దూతికీపద్యము జవాబునిచ్చెనట!

ఉ. ఏవనితల్ మముందలఁప నేమిపనో? తమ రాడువారు గా
రో? వలపించు నేర్పెఱుఁగరో? తమకౌఁగిటిలోన నుండగా
రావవదేమిరా? విజయరాఘవ! యంచిలుదూరిబల్మిచేఁ
దీవరకత్తెనై యిటుల తీసుక వచ్చితినా తలోదరీ!

మఱియు నంతఃపురములో నిట్టిసందర్భములో చెప్పినచాటువులు :

ఉ. 'రాజనిభాననా ! సరసురాలవు; జబ్బుగ నల్లినావదే
మే జడ ?' 'యింతకంటెవలెనే ?' 'వలనొప్ప బిగించియల్లవే
ఓజవరాల ! వేతెపనియున్నది' 'దోసమె.' దోసమే ! మహా
రాజగునట్టి యవ్విజయరాఘవుమై చిగురాకుఁబోఁడీ !

చ. కులికెదవేటికే చెలియ ! కుంచెడు మానెడుగాను నెల్లవా
రలు విననారులే ! విజయరాఘవరాయఁడు నిన్నుఁగూడుటల్ !
వలపులెచాటుచున్నవి; జవాదియు నల్లవు: విఱ్ఱవీగఁగా
వలెనటోఁచూచి యోర్తురటె వంతులుజంతులవేటియెమ్మెలే ?

క. " ఇంతీపానుపుపై నిదె
కంతుడు కూర్చున్నవాఁడు ; గనుగొను!" "వహవా,
కంతుఁడనంగుఁడు ; నీ తెలి
వింతేనా ? విజయరాఘ వేంద్రుఁడు, చెలియా !"

పై పద్యములు 'విజయరామ' అనుమార్పుతో విజయనగర రాజు (కళింగదేశమున) విజయరామరాజుపై అడిదము సూరకవి చెప్పినట్లు కీర్తిశేషులు గురుజాడ శ్రీరామమూర్తి పంతులుగారు సూరకవిచరిత్రలో వ్రాసియున్నారు. ఆవైపున నీ పద్యములు సూరకవి యనియేవాడుక. (పై పద్యములు చాటుపద్య మణిమంజరి (ప్రథమభాగమున) 63, 64, పుటలలో బ్రహ్మశ్రీవేటూరిప్రభాకరశాస్త్రిగారు ప్రకటించియున్నారు.)

రంగాజమ్మ కులమునుగూర్చి యొక్కమాట

రంగాజమ్మ వారాంగయని పూర్వచరిత్రకారు లభిప్రాయ పడియున్నారు. వీరుజన్మముచే వేశ్యలుగానుండియు, సంస్కార విశేషముచేత జాణలై సాంఘికజీవిత మాధుర్యము చవిఁజూపిన సరసురాంధ్ర యత్యున్నతస్థానము నాక్రమించినవారు. రఘునాథరాయల కాలమున, రామభద్రాంబ, తిరుమలాంబ, మధురవాణి, విజయరాఘవుని కాలమున రంగాజీ, కృష్ణాజీ మున్నగువారు కులమున వేశ్యలేయైనను, నేకచారిణీవ్రతము ననుసరించినవారు (అనగా జీవితకాలమంతయు నొకేనాయకుని ననుసరించియుండువారు.) కావుననే వీరిలోకొందఱు, తమనాయకులకుధర్మపత్నులుగాఁ జెప్పికొన్నారు. రంగాజమ్మయు నట్టియేకచారిణీవ్రత సంపన్నురాలై సాహిత్యసామ్రాజ్యము నధిష్ఠించిన పూజ్యురాలు. పరిశోధకశిఖామణులు, విద్వద్వర్యులు మా. రామకృష్ణ కవిగారు 'మధురవాణినిఁ' గూర్చి వ్రాయుచు నీవిషయమున పై యభిప్రాయమునే వ్యక్తపఱచినారు.

ఏనాఁటిసాంఘికపరిస్థితుల కానాఁటిసాంప్రదాయములననుసరించి విమర్శింపవలెను. నేడును నీకులజులు సంగీతసాహిత్యవిద్యాసంస్కార సంపన్నులై, ఉత్తమశ్రేణిలోఁజేరిన తారాగణములై ప్రకాశించుచునేయున్నారు కావునరంగాజమ్మయు,సర్వాంధ్రలోకమునకు, సంతతస్మరణీయయు పూజ్యయు ననుట నిర్వివాదము.

విజయరాఘవనాయని యాస్థానమునఁ గలకవయిత్రులలో 'కృష్ణాజి 'లేక కృష్ణాజమ్మను గూర్చి యీవఱకు తెల్పితిని. ఇపుడాకాలముననే గాక యాంధ్రకవయిత్రులలో నగ్రగణ్యయని చెప్పఁదగిన రంగాజమ్మను గూర్చి వివరించితిని.

## క్షేత్రయ.

దాక్షిణాత్యసంగీతప్రపంచమున, మూర్తిత్రయమని చెప్పదగినవారుముగ్గురు. అన్నమయ్య, క్షేత్రయ, త్యాగయ్య. ఇందు కడపటివారిరువురుతంజావూరికి సంబంధించినవారే. క్షేత్రయ రఘునాథ నాయకునికాలమున తంజాపురాస్థానమునకువచ్చి, యావెనుక విజయరాఘవనాయకునిపై వేయిపదములను చెప్పియున్నాఁడు. ఇవి శృంగారరసవత్తరంగములై వెలయుచున్నవి ఇందుండి యొక **పదము**[1] నుదాహరించుచున్నాను.

కాంభోజి – ఆది

పల్లవి

సుదినమాయెనే యీప్రొద్దు సుదినమాయెనే యీ

అనుపల్లవి

**మదనావతారుని** సేవ – మనకుఁగలిగెనే సుదిన ॥

**చరణములు**

ప్రొద్దున నిలువుటద్దము పొడగన్నఫలము – ఈతని
ముద్దుమోముఁ జూడఁగలిగె – ముద్దులగుమ్మ సుదిన ॥
ఈప్రొద్దు పూర్ణకుంభము – లెదురైనఫలము ఈ
భూపాలకుంజరుని నేఁ – బొడఁగంటినమ్మ
ద్విజరాజుల సేవించిన – దివ్యశకునము అచ్యుత
విజయరాఘవేంద్రుని యీ – విడిదిలోఁగంటి ॥ సుదిన॥

మహారసికుఁడును, మహాకవియు, మహాభక్తుఁడును నగు

1. చూడుఁడు భారతి (సెప్టెంబరు 1950) విజయరాఘవ పదములు. శ్రీతిమ్మావఝుల కోదండరామయ్యగారు. ఇందు (పుటలు 294-295)

విజయరాఘవనాయకుఁడు, తంజాపురాంధ్ర వాఙ్మయమున నేకాక, యావదాంధ్రవాఙ్మయప్రపంచమున చిరస్మరణీయుఁడైన రాజ కవీంద్రుఁడు.

ఇట్టిమహనీయునికిఁ గృతియగు నీరాజగోపాలవిలాసమును నేఁడు ముద్రించినట్టి శ్రీతంజావూరి శరభోజీ సరస్వతీమహాలు భాండాగారము కార్యదర్శిగారి కాంధ్రవిద్వల్లోక మెంతయేని ప్రశంసింపవలసియున్నది. ఈగ్రంథమును సంస్కరించి విపుల పీఠికతోఁగూడ ప్రకటించుటకు నాకనుమతినొసంగిన మదరాసు విశ్వవిద్యాలయాధికారులకు, నిట్టియవకాశము నా కొసగిన సరస్వతీమహాలు కార్యదర్శులు శ్రీ యస్. గోపాలన్, B. A., B. L., గారికి నామనఃపూర్వకకృతజ్ఞతావందనములు. ఈగ్రంథమువ్రాఁత ప్రతిని చక్కఁగా సరిచూచి వ్రాసిపంపిన, సరస్వతీమహాలు పండితులు శ్రీ ఆ. మహదేవశాస్త్రిగారికి నా నమస్సులు. ఈగ్రంథము ప్రూఫులను నామూలాగ్రముగ సరిచూచి, పీఠికవ్రాయుటలో నాకు చేదోడు వాదోడుగానున్న చిరంజీవి శివసుందరేశ్వరరావునకు నాయాశీస్సులు.

నిడుదవోలు వేంకటరావు
మదరాసు విశ్వవిద్యాలయాంధ్ర
భాషాశాఖాధ్యక్షుఁడు

చెన్నపురి
7-7-1951

# శ్రీ రాజగోపాలవిలాసము

## —: విషయసూచిక :—


| | | పుట |
|---|---|---|
| **ప్రథమాశ్వాసము** | | |
| అవతారిక ఇష్టదేవతాస్తుతి | ... | 1 |
| సుకవిస్తుతి | ... | 2 |
| కుకవినింద | ... | 3 |
| శారదాధ్వజవర్ణన | ... | 7 |
| కైవారము | ... | 8 |
| సభానాట్యవర్ణన | ... | ,, |
| కవివంశ వర్ణనము | ... | 11 |
| కృతిభర్త వంశము | ... | 14 |
| కృతిభర్త విజయరాఘవనాయకుఁడు | ... | 22 |
| సాహిత్యరాయ పెండారవర్ణన | ... | 26 |
| షష్ఠ్యంతములు | ... | 32 |
| కథారంభము | ... | 33 |
| స్వీయ-రుక్మిణి | ... | 34 |
| **ద్వితీయాశ్వాసము.** | | |
| జారిణి-భద్ర | ... | 45 |
| జారిణి-లక్షణ | ... | 54 |
| **తృతీయాశ్వాసము.** | | |
| విప్రలబ్ధ-జాంబవతి | ... | 64 |
| ఖండిత-మిత్రవింద | ... | 70 |
| విరహోత్కంఠిత-సుదంతె | ... | 76 |
| **చతుర్థాశ్వాసము.** | | |
| ప్రోషిత భర్తృక-కాళింది | ... | 85 |
| స్వాధీనపతిక-సత్యభామ | ... | 90 |
| ద్వారకావర్ణన | ... | 95 |
| **పంచమాశ్వాసము.** | | |
| చంపకవన వర్ణన | ... | 105 |
| అనుబందము | | 121 |

# శుద్ధపత్రిక

| పుట | పద్యసంఖ్య | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 2 | నాభిప్రాయలై | సాభిప్రాయులై |
| ,, | ,, | భృన్నందను | భృ, న్నందను |
| 6 | (వచనము) 13 | పెంవుగనిన | పెంపుగనిన |
| 33 | 87 | కనియోన్ | కనియెన్ |
| 42 | 123 | పల్కొ నన్ | పల్కొనన్ |
| 63 | (గద్య) 84 | నంద్వితీయ | నందుద్వితీయా |
| 65 | 6 | వేవుదనకున్ | వేపుదనకున్ |
| 72 | 38 | చాసలవంటివే | బాసలవంటివే |
| 77 | 58 | చలుపల | చలువల |
| 77 | 50 | యవని | అవని |
| 102 | 81 | పుహ్పా రామా! | పుష్పా రామా! |
| 103 | (గద్య) 84 | హా స్త్రీశ్వ కరుణా | హా స్త్రీశ్వర కరుణా |
| 104 | 1 | దూళి, దురాలాళి | ధూళిదు, రాలాళి |
| 108 | 17 | అరీతి | ఆరీతి |
| 109 | (వచనము) 13 | గొభిలప్రకల్పితం | గోభిల ప్రకల్పితం |
| ,, | ,, | సంశాధిత | సంశోధిత |
| 112 | 29 | వె, దండము | వే. దండము |

శ్రీరస్తు.

# శ్రీ రాజగోపాల విలాసము

## —: అవతారిక - ఇష్టదేవతాస్తుతి :—

శ్రీలలితాంగియున్ ధరయుఁ జెంగటనే మెలఁగంగ నున్న గో
పాలుఁడ నన్నమాటకు నపారధనంబు లొసంగి రాజగో
పాలుని చేసె నీతఁడని భావము లోపల నుబ్బు శౌరి హే
రాలపు భాగ్యముల్ విజయరాఘవశౌరికి నిచ్చుఁగావుతన్.

మ. సొలపుంజూపుల నద్రికన్యక జటాజూటంబు వీక్షింపఁగా
బెళుకుం బేడిస లభ్రగంగఁ గని సాభిప్రాయులై పల్కు నె
చ్చెలులం గన్గొని మోమువంచు సతిఁదా శృంగారభావంబులన్
వలగో నవ్వుచుఁ జూచు శంభుఁడు కృతిస్వామిం గృపం
బ్రోవుతన్. 2

ఉ. గందపుఁబూఁత రీతి పతి కంఠమునం గల కందుమాన్పఁ దాఁ
గంపలితాత్మకీర్తి రుచికందలిచే రఘునాథభూమిభృన్నం
దనుఁ డంచు నెంచి గిరినందన డెందమునందుఁ జాల నా
నందముఁ జెంది యట్టికృతినాయకు కీర్తులు ప్రోదిసేయుతన్.

మ. చతురంభోధిపరీతభూవలయ వాస్తవ్యావనీదేవతా
తతు లభ్యంజన భోజనాదులను మోదంబందఁగా బ్రహ్మసం
తతిఁ బాలించు నృపాలుఁ డీతఁడని నిత్యప్రీతుఁడై బ్రహ్మమ
త్కృతినాథున్ విభవాయురున్నతుల సత్కీర్తుల్ దగం
బ్రోవుతన్. 4

ఉ. ఒక్కొకవిద్యచే జగతి నొక్కఁడు రూఢివహించుటబ్బురం
బెక్కుడు విద్యలన్నియును నీతఁడె నేర్చి మదీయకీర్తులన్
దిక్కులనింపె నంచును మదిన్ముదమందుచు స్వప్నలబ్ధయై
మక్కువఁజేరు వాణి నృపమన్మథు మత్కృతినాథుఁ బ్రోవుతన్.

ఉ. అందనువందు క్రొమ్మెఱుఁగుటందమునం జరియింప నిందిరా
మందిర మంచు మించు నభిమాన గృహం బొనరించి
లౌల్యమున్
జెందకయుండఁ దావుకొనఁ జేసెను నన్నని లక్ష్మి సంపదల్
గ్రందు కొనంగ మా విజయరాఘవ శౌరినిఁ బ్రోచుఁగావుతన్.

చ. ప్రణతుల కెల్ల విఘ్నములు బాయఁగఁ జేయుట మేలుఁ
గూర్చుటల్
గణనమొనర్చ నేర్పుగను గల్ల మదాళులు మాటిమాటికిన్
రణనము సేయవించుఁ జతురత్వమునం దలయూఁచి మెచ్చునా
గణపతి యిచ్చుగాత కృతికర్తకశేషవిశేష విద్యలన్. 7

—: సుకవి స్తుతి :—

ఆ.వె. అమరతటినిఁ దెచ్చు నల భగీరథు రీతిఁ
గవిత యవనియందుఁ గలుగఁ జేయు
వామలూరు తనయు వర్ణించి మదిలోన
వ్యాసుఁ గాళిదాసు భాసుఁ దలఁతు. 8

కం. నన్నన దిక్కన నెఱ్ఱన
సన్నుతిఁ గావించి వారి జాడల మెలఁగే
యన్నల శ్రీనాథాదుల
మన్ననతోఁ దలఁతు లోకమాన్యుల నెప్పుడున్. 9

—: కుకవినింద :—

కం. అందము చందము నెఱుఁగక
యందతుకుల రచనసేసి యందుకె మది నా
నందముఁ జెందెడు కుకవులు
నిందార్హులు గాక వర్ణనీయులె సభలన్ ? 10

వ. అని యిష్టదేవతా వందనంబును సుకవిగుణానందనంబును గుకవి నిందనంబును గావించి యున్న సమయంబున. 11

సీ. కర్ణాట జయరమా కంఠసూత్రమునకు
మంగళం బే మహామహుని శౌర్య
మా సేతు శీతాచలాంతరాంతర్వాణి
గణనీయ మే రాజు గుణగణంబు
విశ్వాసభాగ్విశ్వ విశ్వంభరాధీశ
పాలనం బే మహీపాలువశము
నిఖిలకార్యాకార్య నిర్ణయ సరణికి
మను నీతు లేమేటి మాటనేర్పు

గీ. లతఁడు హరిదంత దంతావళాలి తరళ
కర్ణచామరబిరుద విఖ్యాతసౌమ్య
కీర్తినర్తన నుతి పరక్షితివరుండు
గరిమఁ జెలువొందు విజయరాఘవవిభుండు. 12

వ. ఒక్కనాఁడు మక్కువమీఱ నంతఃపురాంతర నిరంతర శుభ విభవా చరణ నిపుణ రమా రమణీ రమణీయ తపనీయ కమలకర్ణికాయమానంబును, విశృంఖల కనక శృంఖాళాందోలిత డోలికా చిరత్న రత్న నిర్యుక్త నిర్యద్విభా విభా

వేళల నల్గునట్టి యవివేకులనవ్వుదుమట్టిపట్ల నా
వాలినప్రేమడిందఁ బగవారలఁగూడెను దైవమక్కటా! 76

చ. మొలిచినమోహభారమున ముందర నంతఁబ్రియాను
లాపముల్
బలికినయట్టులైన తమభావముల న్నెలకొన్నగూర్మిచేఁ
దొలుతటియల్కలన్ మఱచి తోడనె వారు రసాతిరేకతం
జెలఁగిరి మాధవుండపుడు చిత్తమునన్ ననలొత్త వేడుకన్. 77

గీ. నేర్పుమాటల మచ్చికలేర్పరించి
చూపు వెంబడి వలపుల సోనగురియ
చికిలిక్రొవ్వాడికొనగోరఁ జిఱుతసోఁకు
లంది నొకకొంత గిలిగింత యంకురింప. 78

చ. మనసిజశాస్త్రమర్మములు మాటికిమాటికి నేర్పుమీఱఁగా
బెనఁకువలందు దెల్పుచును బింకపుజంకెన వాఁడిచూపులన్
మనములయందు సందుకొను మచ్చికహెచ్చఁగ నిండుఁగాగిటన్
వనరుహనేత్రి దేల్చె యదువల్లభుఁ డుల్లము పల్లవింపఁగన్. 79

## ఆశ్వాసాంతము

మ అవనీయాచక హర్ష దాయి వసుధారాజీవ! రాజీవ స
న్నవనాహారణ లక్ష్యలక్షణకళానాసత్య! నాసత్యమా
ర్గవిరోధిక్షితిపావరోధితమహా కాంతార! కాంతారణ
న్నవమంజీరనినాద మోదితమనోనాళీక నాళీకనా! 80

క. ధారాధరలాలస దసి
ధారాదళితారి రక్తధారాళ ధరా
ధారాటనభానిర్జిత
ధారాధరధైర్యదానధారాధారా! 81

కవిరాజవిరాజితము

ప్రతిగజవారణ భీకరవారణపాటిత వారణశృంగఘటా!
తతపురకారణ వైరివిదారణ దారణకారణసైన్యభటా!
క్షితిహితధారణ కృత్యవధారణ సిద్ధసుధారణ కీర్తిభటా!
చతురవిచారణ సద్గుణచారణ సంభ్రమచారణగాంగతటా!

క. అపమానసమానమానిత
తపనీయధరేంద్ర సాంద్రతరకాంతిమహా
స్తపనాభ్యాంతధ్వాంత
ద్విపుయూథా! "ముద్దుచంద్రరేఖా" నాథా! 83

ఇతి శ్రీమత్కాళహస్తీశ్వర కరుణాకటాక్ష లబ్ధసిద్ధ సారస్వతనయ
చెంగల్వ వెంకటార్యతనయ విజయరాఘవ భూపప్రసాదాసా
దితవివిధరాజచిహ్నాచిహ్నిత భాగధేయ కాళయనామధేయ
ప్రణీతంబైన. రాజగోపాలవిలాసంబను మహాప్రబంధంబునం
ద్వితీయాశ్వాసము. 84

శ్రీరస్తు.

# శ్రీ రాజగోపాలవిలాసము.

## తృతీయాశ్వాసము

శ్రీకలితదానతోషిత
లోకాలోకాంతరస్థలోకాలోక
వ్యాకోచోత్పలరేఖా
రాకేందుసరూప! విజయరాఘవభూపా!. 1

గీ. అవధరింపుము! సూతసంయమివరుండు
శౌనకునితోడ నిట్లను శౌరియట్ల
భద్రలక్షణఁ దేలించి ప్రమదమునను
మఱియు గరితలపై చాల మమతయుంచి. 2

విప్రలబ్ధ-జాంబవతి

క. అంతట నా జాంబవతీ
కాంతారత్నంబు దూతికామణితో నే
కాంతంబునఁ బలికెడు నల
వింతల నొకకొన్ని వినెడు వేడుకతోడన్. 3

చ. పలచఁగఁ బూసినట్టి కలపంబునఁ బుట్టిన వింతవాసనల్
కొలనికెలంకు పూఁబొదలకుక్ నెఱతావుల సొంపునింపఁ బై
వలిపెపు దుప్పటీచెఱఁగు వల్లెడవైచి యదూద్వహుండు దా
సొలపునమాపి లేఁజిగురు జొంపపుసందులఁ జూచుచుండగన్.

క. కలకంఠకంఠి యచ్చట
చెలువుని వంచనకుఁ దనదు చిత్తములోనం
గలఁగుచు మరుబాములచే
నలమటఁ బడి దూతితోడ నపుడిట్లనియెన్. 5

శా. చింతాసంతతిఁ జిక్కి చెక్కిటిపయిం జేఁజేర్చి చింతింప నీ
ప్రాంతారామనికుంజ పుంజములచాయ న్నిల్చి వామాక్షి! నీ
కాంతుం డెచ్చెదనంచు వేవుదనకున్ గాసింబడంజేసితే?
కాంతా! యాప్తులు సేయుమాయలకు లోఁగాకుండు
వారెవ్వరే? 6

క. తగవులు తెగువలు బిగువులు
నగవులు పైపూఁతవలపు నయగారములున్
మగువా! యీవగలెల్లను
మగవానికిఁ జెల్లుఁగాక మగువకుఁ దగునే? 7

ఉ. తల్లడమేల? నీవరునఁ దప్పునటంచు ననేకనాయికా
వల్లభుఁడాడు మాట నెఱవంచన యంచు దలంచనైతినో
హల్లకపాణి! యీవికచ హల్లకజాతపరాగజాతముల్
చల్లనిమేనిపై సెకలుచల్లఁగ నేగతి తాళనేర్తునే? 8

ఉ. ఎన్నఁడుసమ్మతించు నిఁక నెన్నఁడు నన్ దయమీఱఁజూచు నిం
కెన్నడు మాటలాడు నిఁక నెన్నఁడు కౌఁగిటగారవించు నిం
కెన్నడు పుణ్యమెల్ల ఫలియించునొ? యంచుఁ దలంచునాథుఁడే
యన్నిటు చౌకసేసినను నాతిరో! యేగతి నోర్వవచ్చునే. 9

చ. అంచలనంచలుండ మలయానిలముల్ మలయంగ చెంగటన్
పంచమవైఖరుల్ తరులపంచఁ బ్రపంచముసేయఁ గోఁగుటల్
పొంచి మరుండు నన్ను సురపొన్నలకోరికి సూటిసేయఁగా
వంచన లిట్లు సేయదగవా? పగవారికినైన నక్కటా!. 10

సీ. చెక్కు-న మకరికల్ చికిలిగోరున వ్రాయు
నపుడునాతోడ నేమనియె మున్న?
మేడచేర్చువరుc దా మెల్ల మెల్లనవచ్చి
నను సన్న సేసి యేమనియె నాcడు?
నిచ్చవెన్నెలగాయు ముచ్చటలాడుచు
నతిరహస్యముగ నేమనియె మొన్న?
నెలదోcటలోన రేయెల్లను విహరించి
యకట! వేకువ నేమనియె నిన్న?

గీ. పలికి బొంకనివాcడంచుc బలుక దెపుడు
నింతలో వింత లోయింతి! యేమిపుట్టె?
నౌర!యా మోహనాకారుc డాచరించు
మాయ లిటువంటి వందుకే మాయనిపుడు.

క. మగవారికిc గలగుణముల
మగువల వలపించు దనుక మమకారంబుల్
మగువలు వలచిన పిమ్మటc
దగవులు మఱి వేఱెకావె తామరసాక్షి! 12

క. కలలోన నైన నెన్నcడు
పలుకులుజవదాcటకుండు పతికిc సతికిc
కలిగెను సిలుగని సవతులు
కలకలనవ్వంగc దాళగలనా! లలనా! 13

సీ. ఎంతనేరము చేసి యేనియు నాచెంత
నిలిచినcగోపంబు నిలుపనేర
చూపులలో వింతసొగసులు చిగురించc
జూచిన వెగటుగాc జూడనేర

నాగడంబులు డాఁచి యతివినయంబుగాఁ
బలికిన మరుమాట వలుక నేర
మమతతోఁ దొల్లింట మచ్చికలెన్నియే
నెన్నినఁ గొదవల నెన్న నేర

గీ. వనిత యొకతప్పు గావంగవలయు ననుచు
నున్న నెటువలె గడిఁ దేఱి యుండఁదొడఁగె
వలచి నట్లుండి వలపని వల్లభునకు
వలచినటువంటి తప్పు నావలన నింతె. 14

క. అని పతిచేసిన వంచన
కనుపించును నేరమెన్నఁగా నావేళన్
విని వినయంబు నయంబునుఁ
బెనఁగొన నిట్లనియె చెలియ బిత్తరితోడన్. 15

మ. వలదే కోకిలవాణి! యేమిటికిఁగా వ్యాఖ్యానముల్ మీరలా
నెలయున్ వెన్నెలయుంబలెం దనరఁగా నెయ్యంపుఁ
గయ్యంబునన్
గలకల్పుట్టవొ? తేరవో? తొలుత నీకాంతాళముల్
గంటిమే?
కులకాంతల్ పతినేర్పునేరముల కెగ్గుల్ పట్టిపల్లార్తురే? 16

గీ. గుణము గోరంతఁ గలిగిన కొండ సేయు
నెంత నేరంబు చేసిన నెన్నఁడెపుడు
చాడిచెప్పిన మనవిగా సంగ్రహించు
రాజగోపాలు గుణమిది రాజవదన! 17

ఉ. ఎంతతపంబు చేసితివో! యెంతటి వేలుపు భక్తిఁ గొల్చితో
యెంతవ్రతంబు సల్పితివో? యెంతటిభాగ్యము సంతరించితో?
యెంతటినోము నోచితివో! యెంతటిదానము నాచరించితో
యింతటివాఁడు నీకుఁ బతియాటకు నంబుజపత్త్రలోచనా! 18

చ. కలకలు మీకు నెన్నటికి గల్గునొ యంచుఁ దలంచి నేర్పుగా
నలుకలు పుట్టఁజేయుచుఁ బ్రియంబులు వల్కినయట్టి పిమ్మటన్
వలపులు కొన్నికొన్ని కొనసైచి మిముం జతగూర్చునట్టి యా
కలికి పిసాళి జంతలము గాముగదే! గజరాజగామినీ! 19

క. అనిపలుకు దూతి పలుకుల
మనమునఁగల కోపభరము మట్టుపడంగా
తనరాకలు మదిఁగోరెడు
వనజానన హృదయమెఱిఁగి వల్లభుఁడంతన్. 20

శా. ప్రోడల్ చూచి సజీవచిత్రముల సొంపుల్ మించ నౌనౌనన్
నీడల్ దేఱెడు నిల్వుటద్దముల వన్నెల్ మీఱ జాబిల్లి రా
గోడల్ కాంతల బింబసంపదల దిక్కుల్ నింప లేఁగెంపు రా
మేడం జేరెను జాళువావలువ క్రొమ్మించుల్ దువాళించఁగన్.

ఉ. అందు విలాసరేఖ యిటులాకృతిచే రహి గాంచెనో యనం
గుందనపుంబసిండి తళుకుల్ వెదజల్లుచు క్రొమ్మెఱుంగె యీ
యందమునందెనా నలరు నంగన చెంగట వచ్చినిల్చినన్
గందళితానురాగ రసకందళమానసుఁడై ముదంబునన్. 22

గీ. లేమ కెంగేలు కేలఁగీలించి పట్టి
సరసనున్నట్టి విరవాది ఛప్పరంబు
చవికెలోపలి పసిఁడిమంచంబు నందు
విరులునించిన శయ్యపై వెలఁదినుంచి. 23

సీ. పాన్పుపైఁ గూర్చుండి బాగాలొసంగుచో
చేసోఁకుటకుఁ గొంతచిత్తగింప
తనుఁజూచి మాటాడ ధవుఁడుఁ బ్రార్థింపంగ
మాటలాడంగ నెమ్మదిఁదలంచి
సకినల బటువులు సరసకు దివియంగ
మొలచిన జిలిబిలి ముద్దుబలుకు
రవళికం గెరలు పారావతమ్ముల మించు
కలరవమ్ముల మాటుగా నొకింత

గీ. తెలిసి తెలియదటన్న సందేహమలర
చిగురుకెమ్మోవి నవలొత్త చిన్నినగవు
బెళకుచూపులరాగంబు పెనగొనంగఁ
బ్రమద పలికినపలుకులఁ బ్రమదమందె. 24

మ. కలయం బర్విన చూపుతూపు లెలగోల్గావించి వేమించి య
య్యలినీలాలకయుఙ్ విభుండు తమి బాహాబాహిఁ బోరాడఁగా
వలరాయండు ప్రసూనవర్షములశేవల్ చూపినట్లయ్యె న
య్యలరుంబోడికి కొప్పువీడి వడి క్రిందై క్రొవ్విరుల్ చిందఁగన్.

గీ. చూపుచూపును సరివోవఁ జూచియపుడు
హృదయములు రెండుసరియాట నెఱుఁగ వేఁడి
గాఢపరిరంభ సంభ్రమ కైతవమునఁ
బాయకుండిరి వేడ్కతోఁ బతియు సతియు. 26

క. రతిచాటువులను నిర్జిత
రతియగుసతి మనముగరంచి రాగముమీఱన్
రతులందేలిచె యాహరి
యతులిత సమ్మోదగర్భితాశయుఁడగుచున్. 27

—: ఖండిత మిత్రవింద :—

చ. అల యెలదోఁటలోనఁ దరళాయతలోచనఁ దేల్చి వేడుకన్
వెలువడి మిత్రవింద గడు వేఁడుకోసం దమకించు నేర్పులం
దలఁపున నిల్పి యవ్వికచతామరసేక్షణ పైఁడిమేడఁ దా,
సొలపునఁ జేరె రూపజిత సూనశరాసనుఁ డొయ్యనొయ్యనన్.

ఉ. చెక్కిటగోరులున్ నిదురచిన్నెలు చూపెడి వాలుఁజూపులుం
బుక్కిటివీడియంబును గుబుల్కొను మేను జవాదివాసనల్
టెక్కులుచూప మీన్బిరుదుటెక్కమువాని విలాసవైఖరిం
జొక్కుచు వచ్చు నాయకునిఁజూచి కషాయిత లోచనాంతయై

గీ. వెగ్గలంబయి మది వెలి విసరినట్టి
కోపరసవేగ మొకకొంత కుదురుపఱచి
చతురగావున నప్పుడా సరసిజాక్షి
పలికె నిట్లని హేతుగర్భంబుఁగాఁగ. 30

మ. కలయం జాగరరాగరంజితకటాక్షశ్రీలు సాంధ్యప్రభ
న్నెలకొల్పన్ సమయానుకూలముగ నీ నిద్దంపులేఁజెక్కునం
దలచూపెన్ నెలవంక దానిఁగని యానందంబు సంధిల్లఁగాఁ
బలుమారుం గరపద్మముల్ మొగుడ సంభావించెదన్ వల్లభా!

చ. చెలువుఁడ! నీవు తామసము సేయుట కిప్పు డుపాయభేదముల్
వలుకఁగ నూహసేసెదవు భావములోవిను క్రొత్తలత్తుకన్
తిలకము వింతవింత వగ తీరున దిద్దినయట్టి తీరులే
తెలిపెను మాకు నెంతయు తేటపడంగ విళంబహేతువున్. 32

ఉ. లోలత నీవు నా మనసులోపల నెప్పుడు సంచరించఁగా
నాలిజనంబు నిన్నుఁదమి నచ్చట నచ్చట నుండివచ్చె నీ
వేళకు నంచుఁ బల్కు నవివేకపుమాటకుఁ గోప మేఁటికిన్?
దాళుము సర్వలోకవిదితంబులుగావె భవచ్చరిత్రముల్. 33

మ కలయం జెక్కు లఘర్మవారికణముల్ గ్రమ్మంగ నొయ్యారపుం
దళుకు న్నిద్దపు మేనిపై చిటులుగంధం బంద మైమించ నూ
ర్పులనెత్తావికి గండుతుమ్మెదలు గుంపుల్ గూడి వెన్నాడఁగా
భళిరా! వచ్చితి వీవు వేగ, రమణీపాంచాల! నాపై దయన్. 34

మ నటనల్ జూపెడి యూర్పుదావులు, నలంతల్ చూపు
వాల్ చూపులున్
చిటిలుంగుంకుమ క్రొత్త లేఁజెమటయున్ శీర్ణాలకశ్రేణియున్
నిటలాలక్ష్యవిశేషకంబుగల యా నీలాలకంబాసి యు
త్కట మోహంబునఁ జేరవచ్చితివి వేగన్ నీవు నాపై దయన్.

సీ. కలుకుఁగుబ్బల సోఁకు కుంకుమరేఖల
మైపూఁతచేతను మాటి నపుడె
గళమునఁ గనుపించు నెలవంకగోరులం
గంటసరంబుచేఁ గప్పి నపుడె
జడవ్రేటు మరుపడఁ గడవన్నె బంగారు
వలిపెదుప్పటి వల్లెవైచి నపుడె
సందిదండలుయొత్తు జాడల బాహాంగ
దముల పూనికచేత దాఁచి నపుడె

గీ. నేరుపరివాదు వన్నింట నీవె జగతి
ముదురుచందురుఁగావి కెమ్మోవి మీఁద
నాఁటనొత్తిన పలుగంటి మాటుపట్ల
మఱుపువచ్చిన నది నేరమా? తలంప. 36

ఉ. వాసనవీడి వాడి సిగవ్రాలెడు పువ్వులు నిన్నమాపు మైఁ
బూసిన యంగరాగములు పూని రయంబునవచ్చి తౌర! మేఁ
గాసిలియుండ నావిధమె కైకొని వల్లభ! ప్రాణవల్లభుల్
వేసటనున్న నాయకులు వేడుకతోఁ గయిసేయరే కదా! 37

ఉ. బాసలుసేసినిన్న నెడబాయను నెచ్చెలి! యీప్రభాతమం
బాసలఁబెట్టి వచ్చియిపు డద్దమరేతిరి దానికన్నునన్
వాసిఁగ బల్కెదిట్లు నెఱవంచన సేయఁగనేల? యౌర! యా
చాసలవంటివే యిపుడు వల్కినబాసలు ప్రాణవల్లభా! 38

చ. జలరుహనాభ! నాదు మణిసౌధముపజ్జను వత్తువెప్పుడున్
వలగొన సంధ్య నీవటులె వచ్చితివిప్పుడు పూర్వసంధ్యగాఁ
దెలియఁగలేక నీవది మదింగణియింపకుమీ కొఱంతగా
కలయఁగ రాగసంపదలు కన్నులఁగ్రమ్మఁగఁ దెల్వికల్గునే? 39

గీ. పచ్చిగాయమ్ము లీరొమ్ముపైని హెచ్చ
మెచ్చి యారతు లీయంగవచ్చు నిపుడె
వెన్నుపైనున్న చెనకుల విధముఁజూడ
గెలుపునోటమి నేమియుం దెలియరాదు. 40

మ. అల జాబిల్లికి హెచ్చుగాఁగలిగె సంధ్యారాగ మారాగ మీ
తళుకున్మోమున నొందకున్న నెట్టులొందర్ వచ్చు నౌపమ్యమం
చలమన్నెమ్మది చింతనేర్పననె యాయందంబు చేకూర్చియున్
భళిరా! తాల్చితివందు మించుగఁ గళాపాండిత్యమానౌనన్ 41

మ. కలయన్ సంధ్యలు గ్రుంకువేళలఁ గదా! కాంతుల్
తమిం గాంతలన్
గలయంగాఁ గమకింతురెందు నిపు డుత్కంఠాతి రేకంబులన్

వెలుఁగం బారఁగ దిక్కులెల్ల రభసావేశంబునన్ వచ్చితీ
తలఁపుల్ వింతలు చక్రవాకములచేతన్ నేర్చితో వల్లభా! 42

మ తెలివిం జెందెను దిక్కులెల్ల నతిసందీప్తంబులై దీర్ఘికా
జలజంబుల్ వికసిల్లె కంటె జలజాక్షా! నీదు వీక్షాంబుజం
బుల నిద్రాలసభావముల్ చెలఁగ నేమోయంచు నీవెంచకా
కలకంఠీమణి మోముచందురుని చక్కంజూచు నుత్కర్షముల్

క. వనితామణి యివ్విధమునఁ
దనుఁగనుఁగొని హేతుగర్భితముఁగాఁ బలుకన్
విని చతుర వచన రచనల
ననునయపరుఁ డగుచుఁ బలికె నట హరియంతన్. 44

మ. నెనరుల్ పుట్టెడి మాటలాడి యలివేణీ! సోపచారంబుగా
మినుకుల్ పుట్టఁగ మాటలాడె దిపుడేమీ? తేటకన్గొనలన్
వినయంబుల్ కనుపించఁ జూచెదవు నీవే వేఱుగావింతువా?
విను! నాపట్లను తప్పుకల్గినను రావే! శిక్ష గావింపవే? 45

చ. కలువలు నీకటాక్షములఁ గల్గిన నేర్పులొకింత నేర్పుటన్
ములుకులుచేసి వాటిఁగొని మోహనవిద్యలనేర్చి మారుఁడో
యలికులవేణి! నీవలకటాక్షములం దయసేయు మిప్పుడా
కలువలగర్వమున్ మఱునిగర్వ మఖర్వముగా ఘటించెదన్. 46

సీ. అదలించవదియేమి? యాననద్యుతులచే
బింకంబు పూను జాబిల్లి నిపుడు
గద్దించవదియేమి? కమ్మనియూర్పుచే
వలగొను నల గంధవాహు నిపుడు

బెదరించవదియేమి? బెళకుచూపులచేత
దాటెడు మగతేంట్ల దాటు నిపుడు
నిరసించవదియేమి? నిద్దంపుమోవిచే
నిగనిగమను మావిచిగురు నిపుడు

గీ. కోకకుచ! నీవు నామీఁదఁ గోపముంచి
యూరకుండిన నింట నేనుండదరమె?
వాటివగలెన్న తొల్లింటి వలపునించి
మించికౌఁగిట నను గారవించరాదె? 47

మ. అలివేణీ! నను నీవు మన్ననలుసేయన్ నమ్మి యేపట్ల నీ
చెలులన్ వేఁడమి నీ వెఱుంగుదువె? నీచిత్తంబులో నిప్పుడీ
కలఁకల్ పుట్టెడివేళ చూచుకొని యేకార్యంబు బోధించిరో?
కలవే! యిట్టివి లోకమందు మరి యాఁగాముల్ విచారింపవే?

ఉ. వాడినమోముతోడ నెనవచ్చును చంద్రుఁడు సారసాక్షి! నీ
వీడినసోగపెన్నెరుల వెంటఁబడున్ సముదాళులంచు నేఁ
జూడఁగఁజాల కావిధము సూచనఁజేసితి నింతె మన్మథ
క్రీడలకన్న నీదు కిలికించిత మేమిటఁదక్కువయ్యెనే? 49

మ సుమనస్సాయకలోల చాపమద ఖర్జూతిర్జనల్ సేయునీ
బొమ పొల్పంబు తదీయబాణముల సొంపుల్ వంపు
వాల్ జూపులుం
బ్రమదాంభోనిధిఁ దేల్చె సౌఖ్యములనాపాదించె
నూహించఁగా
రమణీ! కోపము సేయునట్టి యుపకారం బెన్నఁగా శక్యమే?50

సీ. కుటిలకుంతల! నీదుకురులు చిక్కులఁబడ్డ
దాఁటులువేయదె తేఁటిదాటు
కాంత! నీయూరువు లింత వేఁడిమిగన్న
నామోదిగాదె మందానిలంబు
పడఁతి! నీవెన్నుంటు జడను గాంచినఁజూచి
కేకలు వేయవే కేకులెల్ల
నింతి! నీనెమ్మొగ మించుక వాడిన
చాల మిన్నందదే చంద్రబింబ

గీ. మలుకవూనంగ నీవిప్పు డంబుజాక్షి!
విన్ననై యున్నవిట్టి నీవేళచూచి
గెలువ దమకించు నివియెల్లఁ గేలిసేసి
పగలు నీఁగుట యొక్కొక్కపట్లఁగాదె! 51

గీ. అనుచుఁదా పల్కుపల్కుల కాత్మలోని
కలఁకఁ దేఱిన చూపులఁ గమలనయన
యించుకించుక తనుఁజూచు టెఱిఁగి విభుఁడు
నిండువేడుక తోడ నానెలఁత నంత. 52

ఉ. చక్కని సిబ్బెపుం గులుకు జక్కవగుబ్బల నుబ్బుమీఱఁగా
నక్కుననొక్కి చొక్కి దరహాసము మోమున నంకురింప వేఁ
జెక్కునఁ జెక్కుచేర్చి రతిచిన్నెల వన్నెల వాఁడిగోరులన్
నొక్కన గ్రక్కునన్ గళలనెన్నెలవుల్ గరఁగించ కాంతయున్

శా సంభోగశ్రమబిందువుల్ ముఖవిధుస్వచ్ఛామృతస్యందమై
సంభావింపఁగ లోచనాబ్జములపజ్జన్ బెన్నెఱుల్ గుంపులై
యంభోజమ్ముల వ్రాలు తుమ్మెదల యొయ్యారంబు చాటింపఁగా
పుంభావంబున నాథుఁ దేల్చె పులకల్ పుంఖాను పుంఖంబుగన్.

గీ. మెలఁత పతియును సరి మేలు మేలనంగ
సంగములు వేడ్కతోడ నుప్పొంగుచుండ
రతుల వింతలచే నభిరతులు వెలయఁ
గూడి యానందవార్ధి నోలాడి రపుడు. 55

—: విరహోత్కంఠిత సుదంత :—

గీ. అంతశౌరియు విరహదురంతమైన
యల సుదంతను గనుఁగొను నాసమదిని
చిగురులొత్తఁగ నెలదోఁట చెంతకరిగి.
యందునొక్క మనోహరమైన చోట 56

సీ. వీణాదివాద్య ప్రవీణత రాణించు
ప్రతిలేని రతనంపుఁ బ్రతిమలెల్ల
జాబిల్లి రాగోడ జాడలఁ జాలుగా
ప్రతిబింబసంపద పరిఢవిల్ల
వాటిసమ్మోహన వాద్యస్వనంబులు
ప్రతిశబ్దసంగతిఁ బరగు నందు
మేళముల్ రెండు సమ్మేళమై కనుపించు
మించనియొక్కటి నెంచ లేక

గీ. సమత మన్నించవలెనంచుఁ జాల నెంచి
మించు వేడుక నచట రమించు శౌరి
యపుడు శశికాంతమణిజాలకాంతరముల
నలసుదంతను గనుగోరు నట్టివేళ. 57

చ. కలువలబంతులుం జలువగందపుగిన్నెలు తాళవృంతముల్
తలిరులు పువ్వుబెత్తులును తామరతూడు లనంటిమోవులుం

వలిపెములున్ హిమాంబువుల వాసనగిండ్లను రే వెలుంగురా
చలువల పీఁటలుం గాని విచారముతో నుడిగంపు. చేడియల్

సీ. కథలు చెప్పెదమైనఁ గలికి! లేజవరాలి
కలవరింతలు మాన్పఁగాఁదరంబె?
కలపంబు పైఁజల్లఁగా నలందెదమైన
మదిరాక్షి! మైకాఁక మాన్పఁదరమె?
విరుల వీజనలచే వీచెదమైనను
నెలఁతయూర్పులఁ వేఁడినిలుపఁదరమె?
పసిఁడి యుయ్యాలనుంచి పాడెదమైనను
పఁతి జాగరము నిల్పంగదరమె?

గీ. యవనిఁగలిగిన శిశిరవస్తువులు దెచ్చి
సవదరించెద ముపచార సరణులెల్ల
నెట్టివిధమున నమరునో? యీక్రమంబు
చెలియప్రాణంబు వలరాజుచేతిదింక. 59

సీ. ఉవమానములు లేవె? యువ్విదె నెమ్మోముతో
జాబిల్లి నెంచఁ బ్రసంగమేమి?
సరివోల్పమరి లేవే? జగతి గన్నులకును
వెలిదమ్మిరేకులఁ దలఁపనేమి!
పోలికల్ మరి లేవె? భూమిలో బొమలకుఁ
జెఱకుసింగిణులఁ జర్చింపనేమి?
సవతుగా మరి లేవె? యవనిలో మోవికిఁ
దళుకుఁ గెంజిగురాకుఁ దడవనేమి?

గీ. చక్కఁదనమున శౌరికి సాటిలేరె
యించువిలుకానిఁ బోల్చి వర్ణించ నెంచు
నెంచుఁ దమలోన నేరంబు లెంచుకొనుచుఁ
జెలులు శిశిరోపచారముల్ సేసిరెలమి. 60

ఆ. రాజగోపుఁడిచట రాజాస్యయచ్చట
నెటులఁగలుగు కూటమిరువురకును ?
వనితపాలగలిగి వలరాచవేలుపు
కన్నుఁదెఱచెనేని గల్గుశోభము. 61

సీ. కందుకుందును లేని కలువల చెలికాఁడు
గలిగిన చెలి మేనికాఁకదీఱు
నిత్యవికాసంబు నెగడుతమ్ములు సంభ
వించిన చెలి మేని వేఁడిదీఱు
పగలు రేలొకరీతిఁ బరగు వెన్నల తేట
చేకూర చెలి మేని సెకలు దీఱు
ననిశ మార్దవమున సలరెడు తలిరాకు
లొదవినం జెలిమేని యుడుకుదీఱు.

గీ. ననినఁజెలులార ! యిట్టివి యెందుజగతి
నతనిసమ్ముఖ మతని హస్తావలంబ
మతనిదరహాస మాతనియంఘ్రిసేవ
గలిగినప్పుడె యివియెల్లఁ గలుగుఁ జెలికి. 62

క. అనిపలుకు చెలులఁ గనుగొని
కనుగొనలఁ వేఁడి తేటకన్నీరొలుకన్
వనజానన యిట్లనియెను
మనమున సంతాపభరము మల్లడిగొనఁగన్. 63

చ. ఫలకమునందు వ్రాసి తమప్రాణవిభుం బలుమారు వేడుచున్
బలపల వేగునంతకు నపారవియోగభరార్తలైన యా
నెలఁతల చెంత నవ్విభుఁడె నెమ్మది సమ్మదమంద నిల్చినన్
లలనరో! వారి వేడుక కొలంకులు నిండి తొలంకకుండునే? 64

మ. వెలలేనట్టి పదాంగదంబు చెలఁగన్ వింతల్ భళీ! మేలనం
దళుకున్ వ్రువ గొప్పముత్తియపుటందంబొప్పు బాహాంగదం
బులు రాణింపఁగ ముత్తెపున్ సరపణుల్ ముంజేతులన్ మించఁగా
సొలపుల్ మీఱఁగ వాఁడు వచ్చి కనుమెచ్చుల్ సేయఁ డేమందునే? 65

సీ. ఏలలు వాడుచో నిపుడేటికో? చంద
మామమీఁది పదాలు మానినార
లధికంబుగాఁ గూర్చి రది యేమొ? పన్నీరుఁ
గర్పూరమునుఁ జల్వగంధమునను
సన్నజాదు లిదేమొ యిన్నాళ్లవలెగాదు
పాన్పుపైఁ దఱచుగాఁ బఱచినారు
చేఁబూనుటయెకాక చెలువలు నేఁడేమొ
కీరశారికులఁ బల్కించలేదు

గీ. వెలి విసరినటు లున్నదీ విరహచిహ్న
మింతి! నీ చెంత కాయన యిపుడె వచ్చు
ననెడు నీమాటలకుఁ జాలనలరి యుంటి
నింత తామసమాట యే నెఱుఁగనకట! 66

క. కలఁగన్న మేలుకొన్నను
కళవళమున నైన వాని గాంచియు మఱియుఁ
బలుమరు కనుఁగొనఁ గోరెద
మెలఁతరో! మరి యాస కెందు మేరలు గలవే? 67

మ. పదియార్వన్నెపసిండికి న్నెఱుఁగు రాఁ బై జాదుఁగావించు న
ల్లెదపై కుంకుమమీఁద హేమ కనాహీనప్రభల్ బర్వఁగా
మదనాగేంద్రము లీల వచ్చు విభు మర్మంబుల్ విలోకించినన్
మదనావేశముతోడ నెవ్వతె కళామర్మంబు లూటడవే? 68

సీ. మొగముచూడక మారు మొగము వెట్టుదమన్న
నతనిఁ గ్రమ్మరఁ జూడ నాసయగును
చెలులతో నేమైనఁ బలుకఁబోయెదనన్న
నతని పేరేమాట లంటుదొరలు
నలుకయాయనమీఁద నిలిపెదనన్ననుఁ
బ్రమదంబు తనుదానె పల్లవించు
తలఁపులోనాతనిఁ దలఁపకుండెదనన్న
నతని మీఁదిదె బాళి యగుచునుండు

గీ. నతనిపై నేరముల నెన్ను నట్టివేళ
నతని సద్గుణగణములే యాత్మఁదోచు
మమత లిటువంటి వతనికి మరులుకొంటి
తామసించిన యింక నే దాళఁజాల? 69

గీ. ఎన్నివిధములఁ బలికిన నెఱుఁగ నైతి
వింత నామేనిసంతాప మింత మేన
ననుచు చెలిదూరి వలవంత నాసుదంత
కంతుమందాని లేందులఁ గనలిపలికె. 70

శా. నవ్వుల్ శారదచంద్రచంద్రికలు గా నమ్మించి యాచంద్రికల్
పువ్వుల్ గా సవరించి వాటివెసనమ్ముల్ సేసి యా యమ్ములన్
మవ్వంబుల్ జతగూర్చునంచుఁ దుద నా మర్మంబు నాఁటింపుచున్
చివ్వల్ సేసెద వింద్రజాలములెకా! చింతింప నీవైఖరుల్ 71

మ. అలరుంజప్పర మీ లతావలయ మాహా! మెచ్చువుట్టించె నిం
దలఁపుల్ దీరెదనంచు నెంచి యిటుడాయన్ బోయ చందంబునన్
వలలో బోనునఁజిక్కునట్టు లకటా! వంచించి వేఁటాడె దీ
కులుకుంగుబ్బెత లందెకా మదన! నీకోదండపాండిత్యముల్.

సీ. పక్షపాతమునచ్చి పరభృతమ్ములమెచ్చి
కంటికింపైన చెంగావు లొసఁగి
మాటవాసులగొల్చి మనినఁజిల్కలఁబిల్చి
మేలిమివహి పచ్చడాలొసంగి
తగునడకలకెల్లయగు నంచలకునెల్ల
బహుమతిపద్మాల పట్టులొసఁగి
వడిగలతనమెంచి వరుసదేంట్లకుఁబంచి
వేర్వేరసేవంతి విరులొసంగి

గీ. చెఱకుసింగణిఁ జెంగల్వచిలుకుదొడిగి
పంచసాయక! నను గుఱిపఱచితీవు
చుఱుకుచూపిన హరుచూపు సూడమఱచి
మించి యబలలపై విక్రమించె దార! 73

శా. స్వాహాప్రాణసహాయకీలములకున్ సాహాయ్యముం జేసి యా
మాహామోహనవేషభూషలకు సంపాదించి సంజీవనం
బాహా! మంధరగంధవాహపథిక ప్రాణాపహాస్వాంత! భూ
వాహంబైతివె యింక నెక్కడిది నిర్వాహంబు పాంథాళికిన్ ?

మ. పలుమారు న్నినునమ్మియుండ నకటా! ప్రాణంబు
ప్రాణంబులై
కలయఁ మోహనచూర్ణముం జిలికి చొక్కంజేసి గూఢంబుగా
లలనల్ దాఁచినయట్టి మానధనమెల్లఁ పొంచి లాగించితో
తలఁపన్మందసమీర! లేదుగద నీదాక్షిణ్య మీపట్టునన్. 75

శా. చంద్రాపూరితచంద్రకాంతఫలకస్వచ్ఛప్రఘాణంబులఁ
సాంద్రానందరసాతిరేకములు హెచ్చున్నిల్వ నెమ్మేన ని
స్తంద్రంబై కనుపించె తాప మకటా! దైవంబు రోషించి యో
చంద్రా! చంద్రసమాఖ్యఁగల్గునెడలన్ సంతాపముల్
గూర్చునే! 76

క. రామామణులెటులోర్తురు
రామా! యీసెకలుచెల్లు రాఁపులకుఁ
మామాయని వారింపఁగ
మామాటలు వినవు చందమామా! చలమా! 77

మ. రమణీలోకము నెల్ల నేఁపుచును మేరల్ మీఱి వర్తిల్లఁగాఁ
గమలాకాంతసహోదరుండయిన చక్కం జూడరాదంచుఁ దాఁ
గమలాగారదళారరమ్యులను నేగంగప్పు నీరాకకీ
యమితంబైన కళంక మేమిటను పాయంజాలు దోషాకరా!78

కం. అలుక నిటు లింతిమన్మథ
మలయానిల తుహినకరుల మాటికిఁదెగడఁ
చెలిచూచి పలికె నేర్పున
పలుకుల నెన రుట్టిపడఁగఁ బ్రమదముతోడన్ 79

చ. కలికిరో! నీదు చిత్తమెఱుఁగన్మదినెంచి ముదంబుతోడ నీ
చెలువుఁడు కేళికావనము చెంగటి బంగరుమేడలోన నీ
పలుకులువించు కోరికలు పల్లవితంబులుగాఁగ నున్నవాఁ
డెలమినటన్న నన్నెలఁత హెచ్చిన సిగ్గున మోమువాంచినన్.

గీ. అపుడు కనుసన్నచేఁ బిల్వ నామురారి
వనితచెంతకు వేడుకవచ్చినిల్వ
నలరుటెత్తులు తెచ్చెద ననుచునొక్క-
పనినెపంబున నేఁగినఁ బ్రౌఢదూతి. 81

శా. ఆనందాతిశయంబుమించు నొకసయ్యాటంబుచే నొయ్యనన్
నానల్వ్వాని మొగంబువాంచినను నన్నాళీకపత్రేక్షణన్
నానానూనమనోజశాస్త్రకలనానర్మక్రియానైపుణిన్
దేనెల్ చిందెడు పువ్వుటింటి మణివేదిన్ నేరుపుల్ మీఱఁగన్.

ఉ. ఉల్లముపల్లవించు సరసోక్తుల లేనగ వుల్లసిల్లఁగాఁ
బల్లవశయ్యపై సరసభావము మీఱఁగ నిండుఁగౌఁగిటన్
హల్లకపాణిఁ జేర్చి మనసారఁగ పల్కెడు కుల్కుపల్కులన్
ఝల్లన మేనిపై పులకజాలము నిండఁగ నిండువేడుకన్. 83

చ. విడుమరలేని జెయ్వులను వింతయొయారముచూపు చూపులన్
తడబడు మాటమాటు వగదంటతనమ్ములఁ వింతవింతలై
పొడమెడు భావబంధముల పొంగుచునున్న మనోరథమ్ములన్
బడఁతుకఁ దేల్చె మాధవుఁ డపారవిలాసరసైకలోలుఁడై. 84

శా. అత్యారూఢవిలాసినీజన విలాసాధార! సాధారణ
ప్రత్యాదేశసదేశనమ్రవిహితాబ్రహ్మణ్య! బ్రహ్మణ్యతా

సత్యాపాదితసత్యావాఙ్ముఖ సుధీసత్రాస ! సత్రాసగీ
ష్పత్యంతవిచారకృన్నయవిదా సంసార ! సంసారతా ! 85

క. వరుణాధితపుర కరుణా
కరుణాధిక కాంతిపూరకలితాభరణా
భరణార్థి వైరిశరణా
శరణాగత జయపయోధిజా సంవరణా ! 86

స్రగ్విణి. భావభూశోభిశోభా ప్రభావోపమా
భూవిభా వైభవా భూష్ణు భూమోద్భవా!
భావిభూతోద్భవద్భవ్యవద్భూమిభృ
ద్భావుకోద్భావి పద్మాభవప్రాభవా! 87

క. అతిభీతి వినతవిమత
క్షితిపాలకతిలకసతత సేవితసదనా !
చతురానన చతురవధూ
శ్రితవదనా 'ముద్దుచంద్రరేఖా' మదనా ! 88

గద్య. ఇతి శ్రీమత్కాళహస్తీశ్వర కరుణా కటాక్షలబ్ధ సిద్ధసార
స్వతనయ చెంగల్వవేంకటార్యతనయ విజయరాఘవభూప
ప్రసాదాసాదితరాజచిహ్నచిహ్నితభాగధేయ కాళయనామ
ధేయప్రణీతంబైన రాజగోపాలవిలాసంబను మహాప్రబంధంబు
నందుఁ దృతీయాశ్వాసము. 89

శ్రీరస్తు.

# శ్రీ రాజగోపాల విలాసము

## చతుర్థాశ్వాసము.

శ్రీపదనిజపదసేవక
నేపాళక్షితిప శత్రునిగ్రహ జాగ్రత్
ద్వీపాంతర శుభవిభవ
ప్రాపకజయహారి! విజయరాఘవశౌరీ! 1

గీ. అవధరింపుము సూతసంయమివరుండు
శౌనకుని తోడ నిట్లను శౌరియట్లు
వెలయ జాంబవతీ మిత్రవిందలను సు
దంతఁ దేలించి కాంతలఁ దలఁచి మఱియు. 2

—: ప్రోషితభర్తృక-కాళింది :—

సీ. పార్శ్వభాగాభోగ పరిలక్ష్యమౌక్తిక
ప్రభలు చామరముల రహివహింప
పరిసర పరిచరాంచద్భర్మ పాలిక
లుడిగంపు చెలువల యొఱపు నెఱప
కనకపంజర కీరకలితగీ రచనలు
సాహోనినాదమ్ము సవదరింప
దివ్యమణీగణ దీవ్యద్విభాశ్రేణి
కరదీపకలికల కరణిఁ దనర

గీ. గుంభితమయూఖ ఘనశాతకుంభకుంభ
భానునిర్యత్న నిర్యత్ప్రభానుభావ
మనఁగ పీతాంబరద్యుతు లమరనుండి
రాజగోపాలుఁ డొక సౌధరాజమందు. 3

క. ముందుగ బ్రోషితభర్తృక
యందం బరయంగ దూతి నంపితినని గో
విందుఁడు కాళిందీసతి
చందం బరయంగనున్న సమయమునందున్. 4

గీ. తామరసనేత్రుఁ డొకయింత తామసింప
నొక్క నిమిషంబు యుగముగా నూహసేయు
నట్టి కాళింది తన పార్శ్వమందునున్న
ప్రాణసఖి తోడ నిట్లని పల్కెనపుడు. 5

ఉ. వద్దికివచ్చు నాథుఁడను వార్తలు నీవన నమ్మియుండి యే
నద్దమరేయిదాఁక నడియాసల నాతని రాకఁగోరఁగా
ప్రొద్దునుబోయె నన్ను మరి ప్రోషితభర్తృకఁగా నొనర్చి యే
గద్దరిసుద్దులెంచి వడిగాఁ జనెనో హరి గొల్లపల్లెకున్ ? 6

శా. వాడల్ వాడలనుండి మన్మథకథావ్యాపారముల్ మీఱఁగా
వ్రీడాభారమునన్ బిగించి కడు నువ్విళ్లూరు డెందంబులన్
క్రీడాసౌధము లెక్కి యెక్కి మొగి సంకీర్ణంబుగా దేవతా
చూడారత్నముఁ జూతు రంబుజముఖుల్ సొంపుల్
పిసాళింపఁగన్. 7

చ. పలుకులఁ దెచ్చుకోల్వలపు పైఁబచరించుచు వింతవింతలౌ
కులుకుల లేనిమచ్చికలఁ గూర్చుచుఁ గైతవనర్మమర్మముల్
సొలపులఁజూపు జంతలకుఁ జొక్కుదు రింతయకాక గట్టిగా
వలచిన వారిపట్ల మగవారల కెక్కడిమోహమక్కటా! 8

ఉ. ఎన్నడువచ్చు వీథికడ కెన్నడుచూతము సొంపుమీఱఁగా
నెన్నడు మా మనోరథము లెల్ల ఫలించు నటంచు వానికై

క్రొన్ననవింటివేలుపును క్రొన్ననలం దగఁ బూజసేయు నా
కన్నెలు సేయుభాగ్యములు కామిని! నేడుఫలించెనే కదా! 9

ఉ. వెక్కసమైనమోహమున వేమరు నాతని దూరనేలనో
చక్కెరబొమ్మ! యింకిట విచారములేటికి? నొంటిపాటుగా
నక్కట! యెవ్వతైన మనసారఁగ నవ్విభు నిండుఁగౌఁగిటం
జొక్కఁగజేసి వేఱొకతె జూడఁగనిచ్చునె? వాఁడువచ్చునే? 10

సీ. ఆజానులంబిబాహార్గళంబులవాఁడు
శైలశృంగోన్నతాంసములవాఁడు
శారద విధుబింబచారు వక్త్రమువాఁడు
ధవళాబ్జమిత్ర నేత్రములవాఁడు
కనక కవాటికా కఠినవక్షమువాఁడు
కంబులక్షణలక్ష్య గళమువాఁడు
భాగ్యరేఖాంకిత పాదపద్మమువాఁడు
తరుణప్రవాళ హస్తములవాఁడు

గీ. వానిఁజొక్కించి కౌఁగిట వలపునించి
ముచ్చటలు మీఱ మనసార మోవియాని
ముద్దువెట్టుక సొలపుల ముంచివేడ్క
మరులుకొలుపక విడుతురా మానవతులు. 11

ఉ. ఊరికిఁ బోయివత్తునని యూరటసేయక నిర్దయాత్ముఁడై
యారడిఁబెట్టి ప్రాణవిభుఁ డాతనియొద్దికి దూతినెట్లు నే
నూరికినూరు బొమ్మనుదు నొంటిగఁ బొమ్మనకున్న నక్కటా!
యూరక యుండరాదనుచు నుల్లమునం బరితాపమొందుచున్,

గీ. అటులకాళింది మదనదురంతవిశిఖ
సంతతాసారజాతవిచారయగుట
నను(గు నెచ్చెలి కను(గొని యధిపురాక
యరసివచ్చెదనని తెల్పి యరగునపుడు. 13

క. చెలువు(డు దేశాంతరమున
నిలిచెను నెచ్చెలులు పోవనేర్తురె ? యటకున్
చిలుకలె వలంతులని తన
చిలుకం గాళింది ముద్దుచిలుకం బలికెన్. 14

మ. చిలుకా! పల్కవదేమి? నీకు నలుకా! చింతాసముద్రాంబువుల్
తలమున్కల్ సవరింప తేపవగుచుం దాపంబువారింపవే
తొలుతన్నీవొనరించు మన్మథకథాదూత్యంబునన్ ప్రాణముల్
నిలువం జేసితి నీమహామహిమ వర్ణింపంగ నే నేర్తునే? 15

ఉ. చెక్కలుదువ్వి నీయెదనెఱింగి మెఱుంగుకడాని గిన్నెలో
చక్కెరమేపి ధ్యేఫలరసంబులు గ్రోలఁగనిచ్చి పావడన్
ముక్కున జిడ్డువోఁదుడిచి ముద్దిడి వేఁడెదఁ గాంతుఁడున్న యా
దిక్కున కేఁగి యోచిలుక! తెల్పఁగదే వలిదేనె చిల్కఁగన్. 16

మ. తొలుదొల్తం గుసుమాస్త్రశాస్త్రమతమా ధూత్యంబునం
ప్రౌఢవై
పొలయుల్కల్ వొలయంగ దంపతులకున్ బోధించి
సంయోగముల్
గలుగం జేసిన నీమహామహిమ విఖ్యాతంబు లోకంబునన్
జిలుకా! నా పలుకాదరించి పతికిం జిత్తంబురాఁ దెల్పవే! 17

గీ. అనుచుఁ బలికెడు వేళ నయ్యంబుజాక్షు
మేని జవ్వాదిపస కదంబించ దిశల
నాయకుని రాక యరయఁగఁ బోయివచ్చు
ననుఁగు నెచ్చెలి వల్కె నయ్యతివతోడ. 18

ఉ. హెచ్చెను దిగ్విభాగముల నెల్లెడ మేని జవాదివాసనల్
వచ్చెను నాథుఁ డీనగరి వాకిటికి న్నెఱరాజసంబుతో
మెచ్చవె యింక నైన మెరమెచ్చుల సుద్దులు వల్కనెన్నఁడుఁ
పచ్చనవింటివేల్పునకు భామిని! జాతరసేయు మింకిటన్. 19

గీ. అనుచుఁ బలికెడు వేళ కంసాసురారి
మందహాసంబు చెక్కులఁ గందళింప
వలిపె వలిదుప్పటీ వలెవాటుతోడ
మెల్ల మెల్లనె చెలియున్న మేడఁ జేరి. 20

మ. కలవీణారణనాంకకంకణగణ క్వాణంబు రాణింపఁగా
కులుకుంజన్నుల సాలుపైయ్యెదల కొంగుల్ జాఱు
నొయ్యారముల్
మొలవంజూచు మిటారిచూపులను సొంపుల్ నింపుచుం
గుంపులై
కలకంఠుల్ రతనంపుటారతు లొసంగంజూచి యుప్పొంగుచున్.

గీ. రాజసముమీఱఁ గక్షాంతరములు గడచి
విరహకాతరయై యున్న వెలఁదిఁ జూచి
చిలికిచూపుల వలపులు చిగురులొత్తఁ
బలికెఁ బలుకులఁ గపురంపుఁ బలుకు లొలుక. 22

మ. జలజాతాయత నేత్రి! యే నొక నిమేషంబైన నిం జూడకే
నిలువన్నేర్తునే? యెట్లుదోచె మది సందేహంబు నావల్ల నే
తలఁపుల్ లేవని కిట్లు ప్రోషితసతీధర్మంబు వాటించి లో
దలఁకంగా నిపు డేటికంచు హరి యత్యంతానురాగంబునన్.

క. అని యీరీతిని బలుకుల
నెనరులు చిలుకుచును మానినీమణి హృదయం
బనురాగంబునఁ దేల్చుచు
మనసిజసందీప్యమాన మానసుఁడగుచున్. 24

చ. నిలుపఁగరాని మోహమున నీరజలోచనఁ జేర్చి కౌఁగిటన్
చలువలుగుల్కు క్రొవ్విరుల శయ్యకు నొయ్యనఁదార్చి తేనియల్
చిలికెడు మోవి పల్మొనలచేఁ గసిగాటులుసేసి వీనులం
జిలిబిలిముద్దుబల్కులనుఁ జేర్చుచు నేర్పులు పల్లవింపఁగన్. 25

క. వరరాచకేళిఁ దేలిరి
చెలువయు చెలువుండు వింత చెలువము మీఱన్
కలరవ గళరవములకుం
కలరవములు మెచ్చ పొగడఁగా నవ్వేళన్. 26

—: స్వాధీనపతిక-సత్యభామ :—

సీ. బటువు గుబ్బలమీఁది పయ్యంట లరజార
రమణులు మణి చామరములు వీవ
తారహారంబులు పేరెముల్ వారంగ
వనితలు వలిపెపావడలువైవ

చెక్కులగమ్మడాల్ చిందులుద్రాక్కంగ
పంకజాక్షులు బరాబరులు సేయ
పాణిపద్మప్రభల్ పల్లటీల్ గొనచెంత
హరిణనేత్రలు కొనియాడుచుండ

గీ. రాజసంబున పూర్ణిమా రాజవదన
సత్య గొలువుండ నపుడు నాసత్యమూర్తి
వినయ మీరీతి మూర్తిభవించె ననఁగ
వెన్నుఁ డరుదెంచె దూతిక వెంటనెలమి. 27

క. వచ్చినమాధవుఁ గనుగొని
నెచ్చెలు లందరును మానినీమణి! విభుఁడే
వచ్చెనిదె నీదు నగరికి
విచ్చలవిడి ననిన నిండువేడుకతోడన్. 28

మ. పులకల్ గుబ్బలమీఁద జాదుకొనఁగా పుంఖాను పుంఖంబులై
బెళకుం గా నసియాడ ముద్దులనడల్ బింకంబు బొంకింపఁగా
తలఁపుల్ మీఱఁగ హెచ్చుకోర్కు లోకచెంతఁ బిట్టు
గెర్లాడఁగాఁ
దళుకుంజూపులఁ జూచె భామ విభు నుద్దామప్రమోదంబునన్.

గీ. చూచి యెదురుగవచ్చి యాశోభనాంగి
రమణు కైదండ గైకొని రాజసమున
మెల్ల మెల్లన కెంపురా మేడపొంత
వింతయైనట్టి మణివేది చెంతకరిగి. 30

చ. చిలుకలు వింతలౌకతలు చెప్పఁగ నొప్పగ వాటినన్నిటిఁ
బలుమరు నారజంపువగ పొరువముల్ మదిమెచ్చి మచ్చికఁ

జెలఁగి నుతించునందములు చెల్వాలరం గలనాదవైఖరుల్
కెలఁకులనించు నించుజవికెళ్ నవకంబగు పువ్వుబాన్పునన్. 31

గీ. ప్రాణనాథుండు దానును ప్రౌఢిమెఱయ
నందు గూర్చుండి యుడిగంపుటిందుముఖులు
చిత్తమలరంగ సేవలు సేయుచుండఁ
బ్రమదమునబల్కె విభుఁజూచి ప్రమద యపుడు. 32

మ. తలఁతే మున్నొకనాఁడు నెచ్చెలులు చెంతంజేరిమాటాడఁగా
నెలరా మిన్నల తిన్నెనుండి బయటన్ నిద్దంపు లేవెన్నెలన్
నెలవంకన్ సవరించి నెన్నొసటిపై నెమ్మిన్ సరోజాక్షి! నా
కళుకుం జెక్కిలినొక్కి యొక్కనెలవంకన్ నెక్కొనం
జేయుటల్. 33

శా. లీలామన్మథ! నేఁడు నీతలఁపులో లేదా? రహస్యంబుగా
కాళిందీపటకుంజపుంజముల వేడ్కల్మించఁ గ్రీడించఁగా
హేళిందేఁటులు నాకటాక్షములచాయన్ డాయఁగా నీవు చే
నాళీకంబునఁ జోఁపఁ దావికవి చెంతంజేర నేనవ్వుటల్. 34

మ. కలకంఠీమణు లొక్కనాఁడు నను శృంగారింపఁగాఁ జూచివా
రలవారింపుచు నేర్పుమీఱ కొనగోరన్ పెన్నెరుల్దువ్వి నీ
వలరుందండలు గొప్పనందురుము నొయ్యారంబు లేమెచ్చనా
తలిరున్ వాతెఱ మెచ్చుగానడుగు చందంబందమై యుండెగా.

శా. నెత్తంబాడిన పందెమిమ్మనుచు నే నీకౌస్తుభంబంటఁగా
హత్తెన్ నాకొనగోరు నీయురమునందౌ మంచిదే యంచు నా
గుత్తంపున్ వలిగుబ్బిగుబ్బలపయిన్ గోరుంచి లాలించి నా
చిత్తంబుం గలఁగించుటల్ మఱతువా? శృంగారలీలానిధీ! 36

గీ. అనుచుఁ బలికిన మాధవుఁ డనియెనపుడు
నిష్కళంకమృగాంకాస్య! నెమ్మనమున
నిపుడు తొల్లింటి మచ్చిక లెంచు టెల్ల
నమర మదిసేవసేయుమీ వనుటగాదె. 37

శా. బాలేందూపమఫాల! యేలయిఁక నీభావాతి సంగోపనం
బేలీలన్ విహరింప నీవు మదిలో నేలాగు చింతింతువో
యాలీలన్ సమకూర్చు వాఁడ భవదాయత్తంబు చిత్తంబు నీ
వేళల్ గాచుక సేవసేయుటకునై వేమారు నేఁగోరుదున్. 38

చ. మలయజగంధి నేర్పునను మాధవుఁ డాడిన మాట కిట్లనున్
నళినదళాక్షు! యేనెఱుఁగ నా మది నాఁటిన ప్రేమనిల్లు వి
చ్చలవిడి నాడె దేమి యుపచార విశేషమశేషభామినీ
వలయము నెల్ల నీవు నెఱవంచన సేయుట నన్నునెంచియే! 39

గీ. చిన్నిగోరున మున్ను నా చెక్కులందు
మకరికలు నీవు వ్రాయుట మదిఁదలంతు
కేళి నీ జానిరూపునం గేలిసేసి
డాలుగై కొన్న బిరుదంపు వ్రాలుగాఁగ. 40

చ. అనియిటువారు పల్కుసమయంబున నాప్తసఖీజనంబు తాఁ
జనియెను వేఱువేఱ నుపచారముఁ గూరుచుకై తవంబునన్
వనజదళాక్షుఁడున్ సతియు వైభవమొప్పఁగ వింతవింతగా
బెనఁకువమాటనేర్పు నడిపించిరి యుల్లము పల్లవింపఁగన్. 41

మ. మలయక్షోణిధరాగ్రశృంగములఁ బ్రేమంజూడఁగా నెమ్మదిన్
గలికీ! వేడుకలయ్యెనంచుఁ బలుకంగా నేల? గందంబునా

కలుకుఁజూపు వక్రమువగబ్బి గుబ్బలపయిం గూర్పంగ నీనేర్పునే
తెలియఁగ లేనొకో నీదువంచనకు క్రేతెంగాను గోపాలకా!42

సీ. చిలుకపల్కుల ముద్దుచిల్కుట చూతమా?
మైక్షవవ్యవహారమమరకెట్లు?
కలికి! జక్కవకవల్ కలయిక చూతమా?
యరుణగంధంబు పైనలమకెట్లు?
కలకంఠరవము లాకర్ణించ చూతమా?
యిగురుమోవులమేత లియ్యకెట్లు?
నెమ్మలుపురివిచ్చు నేర్పులు చూతమా?
యుపరిఘనస్ఫూర్తి యొదవకెట్లు?

గీ. లమృతములుచిల్కు విధుఁజూచు నద్దమెట్టు
లిందుకిది యుత్తరంబని యెఱుఁగ నిపుఁడు
తొలుతఁబలికిన వాటికి తోడుతోడ
హరువులొనఁగూర్చి సుఖముల ననుభవింపు. 43

మ. తలిరున్ మోవులు నొక్కినొక్కి కడు నుద్దామప్రమోదంబునన్
గలకంఠుల్ కలకంఠరావముల జోకల్ జూప వేడ్కల్ చెలీ!
కలకంఠాళియు నల్లైవర్తిలఁగ నొఁగాదన్న వారెవ్వ రీ
తలఁపుల్ గూపవిలాసపోషితవసంతా! నీకు చేకూడవా.! 44

మ. జలజాక్షీ! విను చందమామకు సుధాస్యందంబు లందంబులై
చెలఁగంజూడఁగ వేడుకయ్యెడిని నీచిత్తంబునన్ లేదకో
జలజాక్షా! జలధిన్ మథింపఁగ సుధాస్యందంబు లందంబులై
చెలఁగం చందురునందు నింతయువి వాసిన్ మించ
నేనెంచెదన్. 45

గీ. అనుచువారలు మాటల ననుచు వేడ్క
గాఢపరిరంభ సంభ్రమకౌశలముల
వినిమయ కృతాధరాస్వాద విభ్రమముల
కలిత కిలికించితమ్ముల గలసిరపుడు. 46

చ. కలిగె సమానురాగములు గల్గిన వీరికి నేడుకూటముల్
నెలకొనె నాదుకీర్తులని నెమ్మది వేడుక పంచసాయకుం
డలరులసోన నించెనన నయ్యలికుంతల కుంతలంబులన్
జలజలరాలె పూలు సుమసాయక సంగర కౌశలంబునన్. 47

మ. తళుకుంజూపుల వెంబడించిన యలంతల్ వింత లేనవ్వులం
గలయంబర్విన కమ్మవీడియపు చెంగావుల్ దువాళించగా
వలపుల్ సంపంగిదండవోలె వసివాళ్వాడం దనూవల్లి యా
నలినాక్షీమణి చూడనొప్పె హరి యానందాబ్ధినోలాడగన్.

గీ. అంతశశిజాతె తిమిరంబు లడగబాతె
కువలయంబులు వాడి జక్కవలుకూడి
దెసలు తెలివొందె విరహుల దెసలుడిందె
తపనుడుదయించె సాంధ్యకృత్యములు మించె 49

క. చతురానన ముఖులందఱు
నతులొనరింపంగ దక్షిణద్వారకలో
క్షితిలక్ష్మీనీళాదులు
కుతుకంబున గొల్వరాజ గోపకుడుండెన్. 50

## ద్వారకావర్ణన.

గీ. వాసుదేవుని సంతతావాసమునను
భాగ్యములకెల్ల నెల్లయై పరగునట్టి

తన్నివాసంబు మహిమ యే ధన్యమతిని
తెలిపెదను నీకు మునిలోకతిలక! వినుము. 51

సీ. శ్రీధరావీక్షణ శ్రీధరామ్రేడిత
కమలతోరణదామకవచితంబు
ప్రత్యూషశ్రుతిపాఠ పరధరామరసుత
సహపాఠి శౌరికా సముదయంబు
ప్రతిమాస కల్పితప్రతి ముహూర్తారబ్ధ
రాజగోపోత్సవరాజితంబు
కనకగోపుర రత్నకలశన క్తందివ
నాటితామిత సూర్యనాటకంబు

గీ. కీర్తనీయని కేతన కేతనాగ్ర
పక్షిరాజహిరణ్మయ పక్షవితత
విద్యుదంశుసముద్ద్యోత వితతతమము
దక్షిణద్వారకా పురో త్తమము దనరు. 52

మ. అలనీలాలక లందు రత్నమయగేహద్వారబంధారర
మ్ముల పొందమ్ములయందుఁ దేటిగమిసొంపుల్ నింపు
నాత్మీయచం
చలవీక్షాంచలపాళి కుల్కఁగని యిచ్చన్ నవ్వుచున్నట్టిచి
ల్కల శిక్షింతురుపల్కుటందముల జోకల్ నేర్పు నేర్పుల్ తగన్.

మ. తలఁపన్ వేలకొలందులై తనరు కాంతారత్నముల్ మేనిపైఁ
గలయన్నించిన మన్మథాంకము లెసంగ న్నాథుఁడే తేరఁగా
లలనల్ కన్నులఁజూచి యుండి మును నల్కల్ పూన
రుద్యుక్తుడై
వలరాయుండు ధనుర్ధరుండగుచు నిల్వన్ తద్ గృహా
గ్రమ్ములన్. 54

మ. కరముల్ సాఁపుచు చూపిచెప్పఁగ మరుత్కాంతల్ జయంతాదులా
నరుదుల్ చూచితిమంచు మెచ్చి మదిలో హర్షింప వైడూర్యముల్
తెఱలెత్తన్ మణిదీపముల్ చెలఁగ హాళిన్ జాళువామేడలన్
సొరిదిం గన్నెమెఱుంగు గుంపులు నటించున్ మెచ్చుగా నచ్చటన్. 55

శా. తారామార్గముమీఱు సౌధగృహసంతానంబు పైబంగరుం
రారేకల్ నవసూన సౌరభములన్ రాణింప పొందమ్ములన్
బేరాసన్ సురసింధుపద్మములలో భృంగాళి యేతెంచి ఝుం
కారంబుల్ సవరించుఁ దన్మహిమకుం గైవారముల్ నాతగన్.

మ. తళుకుం గెంపులయండ నీలనికరధ్వాంతంబున గోకముల్
కలయంగా గమకించి పాయుటకునై కాంతామణుల్ నవ్వ నా
జిలుగున్ వెన్నెలఁ జంద్రకాంతవలభీ సీమల్ పయోధారలం
దలకొల్పంగఁ దదగ్రగేహ మమరున్ ధారాగృహం బోయనన్.

మ. వలువల్ కోరినయట్లు కల్పలతికావ్రాతంబొసంగన్ మరు
జ్జలజాక్షుల్ గయికోఁ దలంచు నెడ నాసౌధాగ్రహీరప్రభల్
వలువల్ నాఁగఁ దదంతరాళములఁ బర్వన్ వాటిఁ బూనంగ చే
తులు సాఁపం గని గొల్లున న్నగుదు రింతుల్ తద్గవాక్షమ్ములన్.

మ. రమణుండందరు వేరువేరను శరద్రాకాశశాంకాస్యలం
గ్రమముల్ మీఱఁగ నేలువైఖరులఁ దత్కాంతా శిరోరత్నముల్
సమరాగంబున వానికిన్ వలచు నాసయ్యాటపుం నేర్పులం
దమిపుట్టించు నిలింపదంపతులకుం దచ్చిత్రలేఖాంకముల్. 59

7

శా. రాణింపన్ తుదసజ్జలన్ వెలిగుడారంబుల్ దిగంతంబులన్
నాణీయ స్తరకరత్నగుంభముల చాయల్ మోహరింపన్ శచీ
ప్రాణాధీశ్వరు సౌధముం గెలిచి తత్ప్రాసాదరాజంబు త
న్మాణిక్యంబులడాల్ హరించె భళి! సన్మానార్హమహానసన్.

ఉ. ప్రొక్కుచు వేఁడుచుం గదిసి ముద్దిడుచున్ నును మోవి నొక్కుచుం
జొక్కుచు గోపికల్ ప్రియునిఁ జొక్కఁగ జేయు విలాస చిత్రముల్
చిక్కనిసిగ్గులం బ్రియుని చెంతలఁ జేరక చంద్రశాలలం
దొక్కెడఁ జూచు నచ్చటి నవోఢల మూఢలఁ జేయు నెంతయున్.

మ. వలభీప్రాంతమునందు కార్మొగిలు క్రేవన్ డాఁగుచున్ గ్రమ్మఱం
దళుకుల్ చూపుచు చంచలల్ మెలఁగుచందంబుల్ విలోకించి
వేడ్కలమీఱన్ హరినీలదీధితి తమస్కాండంబులో నచ్చటం
లలనల్ డాఁగిలిముచ్చులాడుదురు లీల నాథుఁ డుప్పొంగఁగన్

ఉ. ముక్కలఁ గెంపురాతళుకు మొక్కల మేటికిరీటి పచ్చరా
ఱెక్కలమించఁగా నదనెఱింగి మెలంగు మెఱుంగుబోడులం
జక్కెరవేడుచో నచట జాతి విజాతుల నేర్పరింతురా
చక్కెరబొమ్మలో వరుల చక్కని నిల్చిన చిల్కగుంపులన్. 63

మ. కరిదంతమ్ముల పువ్వుబోదె తుదసింగంబుల్ పిసాళింపఁగా
సరసం బెంపుడువేళ్లు వాటిగని చాంచల్యంబు చేఁదాఁటి కా
తరసారంగవిలోచనా మణులచెంతన్ నిల్వ చెల్వొందు తా
నరయున్నచ్చట వీక్షణాంచలములం దాపమ్యమా మేడలన్. 64

శా. చాలా మేడలఁ జంద్రకాంతజలనిష్యందంబు లవ్వీటిలో
లోలాక్షుల్ తమిఁజూచునప్పుడు తదాలోకానుషంగంబునన్
వాఁ రారున్ మగవాలుఁగల్ గలుగుశేవంబర్వన్ గేహేందిరల్
మీలంచుల్ ధరియించునట్టి కరణిన్ మించున్నిశావేళలన్.

ఉ. వేడుకకాంద్రగూడి తటివెన్నెలరేలు మిటారికత్తియల్
మేడలమీఁదనుండి మెరమెచ్చులకై జతగూడిచల్లగాఁ
బాడెడు పాటమెచ్చి సురపాదపముల్ తలలూఁప రాలు న
వ్వాడనిపువ్వు లెవ్వరును వాడనివారట లేరు చూడఁగన్. 66

ఉ. అల్లన చంద్రశాలల నొయారులు పౌరుష కేళిసల్పుచో
ఝల్లునరాలు ముత్యములు సారసదీకనకాంబుజంబులం
దెల్లనుఁబర్వ నంచగమి యింపలరం దమగ్రుడ్లటంచు మై
చల్లని రెక్కలంబొదువు చంచువులఁ బలుమారు దువ్వుచున్.

చ. జలకములాడి నున్నడుగు సాలియలూని ప్రియానురక్తికై
మలయజగంధు లప్పరము మాడువులన్ స్మరమంత్రవాదపుం
గలరవముల్ బయల్పరపఁగా విని నేర్చిన యందువల్ల నే
కలరవనామధేయములు గల్గె జగంబునఁ బారువాలకున్. 68

చ. కులగుణరూపరేఖలనె కోరివరింతురు పల్లవావళిన్
వెలవెలఁదుల్ పసిండికయి వేడరు తక్కినవారినచ్చటన్
బెళుకుమెఱుంగురంగు నెఱబింకము సుంకము వెట్టుమేని క్రొం
దళుకులచేతఁ దాము సతతంబును పైఁడి వసంతమాడగన్.69

సీ. వెన్నెల లొక్కొక్క వేళగాని చెలంగ
వవియు నవ్వులకు నీడనఁగరాదు
కమలముల్ దినమందె కానియందముఁ జింద
వవియు మోములకు నీడనఁగరాదు

కలువపువ్వుల రేలుగాని నీటువహించ
వవియి చూపులకు నీడనఁగరాదు
తలిరు లామనిగాని తలచూపగానేర
వవియు మోవులకు నీడనఁగరాదు

గీ. మేలి తనసాధనమ్ముల మించి వీట
వెలవెలందులయెడ వింటి విభవమనుచు
నతనుఁ డడిదమ్ములుగ వారి నర్చసేయు
టనుమితంబగు గంధమాల్యాదికముల. 70

మ శరవేగమ్ముల నాత్మవేగములు మించన్ వేగమున్నాడి మీ
కరవల్గత్కరవాళముల్ విమతపక్షంబుల్ విభాళించఁగా
శరసంధానము లేల మీకు ననువై సాదిప్రజామాళితో
పురిలో వాహాపరంపరల్ చలతరప్రోథంబుగా హేషలన్ 71

చ. జలదములం బ్రతిద్విరదశంకను కొమ్ములగ్రుచ్చి చిమ్మఁగా
వెలువడు తద్గతాశనుల వేఁడిమి కోర్చిన వారనాళికిం
బలిమిగ నగ్నియంత్రముల బన్పరపన్ వలదంద్రు వీట యం
తలు రణమన్నపట్ల మదధారలు చిందగ నింతయోఁటికిన్. 72

సీ. బటువుసిబ్బెపు గుబ్బపాలిండ్లపేరిటి
గట్టులపైనున్కి పట్టుసేసి
గప్పుచిప్పిలు గొప్పకొప్పులపేరిటి
చీకటిపొదరిండ్ల చెంతనిలిచి
కనుచూపుమేరకు గనరాని నడుముల
పేరి యెడారుల దారినుండు
జిలుగుఁజాయల వాఁడిచికిలిచూపులపేరి
ఛిలుకటమ్ములుకొన్ని చిలికిచిలికి

గీ. వంచనను బొంచి తను గానుపించకుండ
సతులచేతనె పురిచెంత సతులమహిమ
నర్థ్యగుల మానధనముల నపహరించు
వించి విలుపాళిగాని వర్ణించదరమె? 73

చ. పలుమొనకెంపుగుంపు పయిపై నిగుడం జిగురాకు మోవులం
గలసిమెలంగునట్టి గణికావిటపాళుల కేళిచూచి యో
పలుమొనకెంపుగుంపు పయిపై నిగుడం జిగురాకుమోవులం
గలిసిమెలంగు వీట గణికావిటపాళి వనాంతరంబులన్. 74

సీ. విప్పారు చెంగల్వవిరు లమర్చినయట్టి
యద్దంబు మేలుమే లనఁగవలయు
తెలిమొల్ల మొగ్గలు దినుసేర్చికూర్చిన
మగటిమి హెచ్చని పొగడవలయు
పసిఁడి సంపెంగలు పొసంగించినటువంటి
హరువులోనని కొనియాడవలయు
నరవిరులొ పొన్నలలవరించిన యట్టి
నెఱజాణతనము వర్ణించవలయు

గీ. నలువనిర్మించె నను చెల్వు గలుగవలయు
నట్టిసురలకు మీకు నెంతైన పిలువ
ననుచుఁబలికెడి సరసుల కపుడు వీటఁ
బుష్పలావుల నవ్వులం బులకలొదవు. 75

మ తనియన్ మావులు పువ్వుఁదేనియలఁ గేదారంబుల న్నిచ్చలుం
జినుకం బ్రొద్దొకవన్నె నందు గళమ శ్రేణుల్ ఫలంబంది వే
వినతుల్ సల్పును వాటిపాదముల కుర్వీంద్రాళి లోకంబులన్
దనుబోషించిన వారిపట్ల మరివింతల్ గావు సత్సమత్వముల్. 76

శా. వెంటం జాజులు కూరలన్నమును వేత్వేరం దగబూని తత్
ఘంటామార్గమునందు జాఁగటలచేతన్ బెట్టు చాటించి యిం
టింటం బాంధవులంబు నారయుచు నెంతే తృప్తిగావింతు రా
కంటం జెందక యుండ రేయిపగ లుత్కంఠన్ నృపాజ్ఞాపరుల్.

చ. మలయజమాని మేనమును మాపటి పూటలయందుఁ జల్లఁగా
జలకములాడి రింతులను సారెకు నప్పుర వీథులెల్ల దా
వలగొని తెల్పు కేళి రసవాటులచెంగటి చంద్రకాంతపుం
గొలఁకుల నీటితావి విరికోటికి దూతికరీతిఁ జాతురిన్. 78

చ. మలయసమీర మప్పురముమాడువలందు రతాంతతాంతలా
చెలువలు దేర్చి లేఁజమట చిత్తడులం దొలగించి వాలు మై
వలచు సుగంధముల్ తన కవారణమై యొసఁగంగ ద్రిమ్మరుం
గలుగదె లోకమందు నుపకారికిఁ బ్రత్యుపకార మెన్నగన్.

శా. కంజాక్షీ హృదయానురంజన కళాగంధర్వ! గంధర్వభూ
మంజీరధ్వనిధాటి కాతిఘటనామం దేహ! మందేహతా
పుంజీభూతవిరోధి విద్రవవిధాంభోజాప్త! భోజాప్తవ
త్తంజాపట్టణ హారనాయకమణీ దామాంక! ధామాంకనా!

క. రామాభిరామ ధామా
ధామాధికభీత భూమిధవ కృతనామా
నామాంకిత జయభూమా
భూమానితగుణ వసంత పుష్పారామా! 81

### అశ్వగతి - నిరోష్ఠ్యము

భూరమణీ మణిభాగ్యవశంవద భూరిభుజాయుగమానబలా
మారవిసృత్వరభాసముదిత్వర మంజిమసమ్మద భాగబలా
వారిరుహాప్తసమగ్ర రుచిప్రతి వాదినుహాపరిపాల్యబలా
వీరగుణావృతహృత్య సుహృత్ పృథివీధవదావిక్రపాణబలా

క. శ్రీ "ముద్దుచంద్ర రేఖా"
ప్రేమ స్థేమాభిరామ! బిరుదాంకకథా
నామాంకిత శాత్రవభూ
భూమాపహవిజయ సమరపుంఖితపటహా! 83

గద్య. ఇది శ్రీమత్కాళహస్తీశ్వ కరుణాకటాక్ష లబ్ధసిద్ధ సార స్వతనయ చెంగల్వ వెంకటార్యతనయ, విజయరాఘవ భూప ప్రసాదాసాదిక వివిధరాజ చిహ్నచిహ్నిత భాగధేయ కాళయ నామధేయ ప్రణీతంబైన రాజగోపాల విలాసంబను మహా ప్రబంధంబునందు చతుర్థాశ్వాసము. 84

శ్రీరస్తు.

# శ్రీ రా జ గో పా ల వి లా స ము.

## పంచమాశ్వాసము.

శ్రీలక్షితపదలక్షణ
చోళగజలదుర్గ సింధుశోషకఘోటీ
వేలాతిగఖురధూళి
దురాలాలితతేజ! విజయరాఘవభోజా! 1

గీ. అవధరింపుము సూతసంయమివరుండు
శౌనకునితోడ నిట్లను శౌరిమున్ను
చంపకారణ్యమునకును సంఘటించె
దక్షిణద్వారకా సంజ్ఞ ధన్యమతిని. 2

క. వినుమందుకు నితిహాసము
వినుతంబై సకలవేదవేద్యంబగుచున్
తనరారు నట్టికథ యే
వినుపించెద నిపుడు మిగుల వేడుకతోడన్. 3

క. అష్టోత్తర శతనిలయము
లిష్టమ్ములుహరికి నందు నెనిమిదియే యు
త్కృష్టములు వాటియందు వి
శిష్టము చంపకవనంబె శిష్టాచారా! 4

సీ. సౌరభ్యపరిభూత షట్పదపంక్తినా
హోమధూమము మిన్నులొరయుచుండ
శాఖాయుశాటికా ఖండమండలమునా
వికచకోరక విభావిభవ మమర

ఘనతపోమహిమ నిర్గతరజోగరిమనా
రాజత్తర పరాగరాజమలర
శ్రుతిపాఠసంతతోత్సుక శుకశ్రేణినా
సనవకోరకపత్ర సమితిదనర

గీ. మదనమార్గణ గణనయ మహిమమయ్యు
మదనమార్గణ విరహిత మహిమఁ జెలఁగు
రాజగోప పదధ్యాన రాజమాన
భక్తలోకావనంబు చంపకవనంబు. 5

గీ. అట్టి చంపకవనమున నఖిలమునులు
తపముఁ గావింప వారిలో ధన్యతముఁడు
వహ్నిముఖుఁడను సంయమివరుఁడు చెలఁగు
సతతగార్హస్థ్య సన్నుతాచారుఁడగుచు, 6

చ. అలమునిలోకచంద్రునకు నాత్మజులై జనియించి రెంచ గో
ప్రళయుఁడు గోభిలుండునను భవ్యచరిత్రులు వారిలోన గో
ప్రళయుఁడు పూర్వపుణ్యపరిపాకఫలంబున మించె నెంతయుం
జలరుహనాభ పాదజలజాత వినిశ్చలభక్తియుక్తుఁడై. 7

సీ. కల్యసాకల్య సంకల్పితస్నానంబు
సాంధ్యకృత్యంబును జపసమాధి
యగ్నిహోత్రము దేవతార్చనా విధియును
వేదపాఠంబును వినయగరిమ
మాధ్యందినాది సన్మానితాచారంబు
నభ్యాగతులుకు మృష్టాన్నదాన
మర్శాపురాణ సమాకర్ణనంబును
తద్గతబహువిధ ధర్మచింత

గీ. యనుదినంబును సహజకృత్యంబు గాఁగ
మేలుమేలని జగమెల్ల మెచ్చిపొగడ
బ్రహ్మవిద్యావిదుండు గోప్రళయమౌని
తపముగావించె శ్రీహరిఁ దలఁచిభక్తి. 8

మ. బలునిష్ఠన్ మధువాసరాత్యయములన్ పంచాగ్నిమధ్యంబునన్
వలిగాడ్పుల్ నిగుడంగ బట్టబయిటన్ వర్షప్రకర్షంబునన్
పులకల్ జాదుకొనంగ శీతువున సంపూర్ణోదవాసంబునన్
చలనంబందక సల్పె నుగ్రతప ముత్సాహంబు సంధిల్లగన్. 9

క. నిరుపమనిష్ఠానిధి యగు
పరమ మునీంద్రుని తపఃప్రభావము మదిలోఁ
బరికించి పంకజాక్షుఁడు
కరుణకుపాత్రంబు సేయఁగౌతూహలియై. 10

సీ. గరుడిఱెక్కలగముల్ గగనసౌధమునకు
కనకంబు వ్రాయువాఁగరులు గాఁగ
పసిఁడిచేలచెఱంగు బర్హిబర్హంబను
మేఘంబునకుఁ గారుమెఱుఁగుఁ గాఁగ
కరుణాప్రవాహంబు కన్నుదమ్ములకును
పసిమించు మకరందరసము గాఁగ
మొలకనవ్వులు లచ్చిమోము జాబిల్లిపై
నెలకొన్న చిన్నివెన్నెలలు గాఁగ

గీ. గరుడగంధర్వగాయనీ గానమమర
నమరనాయకు లిరువంక లందుఁగొలువ
విలువలేనట్టి శృంగారవిభవమెసఁగ
నంబుజాక్షుండు మునికిఁ బ్రత్యక్షమయ్యె. 11

మ ఘననిష్ఠం దపమాచరించు మునిలోకశ్రేష్ఠుఁ డవ్వేళఁదా
కనుదమ్ముల్ వికసిల్లు చెంగటను సాక్షాత్కారముం జెందు న
వ్వనజాక్షున్ భువనైకరక్షకుని దుర్వారప్రభావోన్నతుం
గనియెన్ పెన్నిధిఁగన్న పేదగతి నుత్కంఠాతిరేకంబునన్. 12

సీ. బ్రహ్మాండభాండముల్ బంతులుగామాటి
కలదు లేదనునట్టి ఘనుఁడవీవ
పదునాల్గు జగములు భరియించి జలధుల
విహృతిసల్పిన మహామహుఁడవీవ
పొక్కిలి విరిదమ్మి భువనముల్ నిర్మించు
బుధుతనిగన్నట్టి ప్రోఢవీవ
పదిరూపములుపూని పదిలంబుగాభూమి
కరుణాఁగాచిన జదత్కర్తవీవ

గీ. మూఁడుమూర్తులు మెలఁగెడు మూర్తివీవ
వేదవేదాంతముల నిన్ను వెదకివెదకి
కానకున్నట్టిపట్ల నీఘనత లెల్ల
వల్లవీజార ! కొనియాడవశమె మాకు ?. 13

గీ. వినతిగావించి యీరీతి వినుతిసేయు
మౌనిచంద్రునిఁ గనుగొని మాధవుండు
మించు నీనిష్ఠకును జాల మెచ్చినాఁడ
నడుగు మాకాంక్ష్యమయ్యది యనిన నతఁడు. 14

ఉ. వారిజనాభ ! నీవు మును ద్వారకలోపల గోపగోపికా
వారము రుక్మిణీప్రముఖవారిజనేత్రలు సేవ సేయఁగా
వారిధితీర శైల వనవాటికలన్ విహరించునట్టి యా
మేరలు చంపకాటవిసమీపమునన్ మెఱయింపు మింపుగన్. 15

గీ. అనుచు నమ్మౌని కోరినయట్లు సల్పి
వనజనాభుండు చంపకవనమునకును
దక్షిణద్వారకాభిఖ్యదయ నొసంగి
యతనిప్రార్థన నచ్చట నధివసించె. 16

క. అరీతి నధివసించిన
నారాయణదేవు చరణనళినమ్ములకున్
సారెకు నతులొనరింపుచు
ధీరవిచారుండు మౌనితిలకుఁడు పలికెన్. 17

వ. దేవా! దేవరవారు నిచ్చలునిచ్చట నధివసించుటవల్ల నుల్లంబు పల్లవితంబయ్యె నయ్యెడ నేగావించు తీర్థంబునకు వాయవ్యంబున బాణపాతపరిమిత ప్రదేశంబున నవిరళపరిమిళిత ప్రసవవిసర పరాగాభోగ విభావిభావనీయసాంధ్య వేళాతివేలా తి లంబిదీపశిఖా రేఖామోహాపహా పాదలంబి శిఖాముఖా లక్ష్య సౌవర్ణవర్ణ జాలజాలకంబును నినసంపాంస సారలోభలో లుపస్వాంతభూనభోంతర నిరతయాతాయాత పరిశ్రాంత శశి కాంత ప్రముఖామర వ్రాతసంజాత తాపత్రయనిదాఘ తాప గర్వసర్వస్వహరణ చణ వర్షావర్ష మధురమధు రసధారాదుర్దిన దినారంభంబుననగు చంపకంబు సదేశంబున నిదేశకారులై మార్కండేయ మాండవ్యమౌద్గల్య సనక సనందనసనత్కుమా ర సనత్సుజాతాది మౌనిసంఘంబుల సంఖ్యంబులుగా సవనం సవనంబులుసల్ప విమానీకృతదివ్య విమానంబగు విమానం బులగు బున నివేశించి విశ్వరక్షణ వ్యాక్షణంబును విశ్వ కర్మనిర్మితంబుననగు త్రిణతంబు ధరించి భక్తకటాక్షవీక్ష ణానుక్షణ కృతార్థంబుగ కృష్ణతీర్థంబుగావించి ఆభీర భీరుకుచ

శాత కుంభాకుంభ గుంభిత కుంకుమ పంకహారిద్రా ముద్రా ముద్రిత వీచికా సారంబగు కాసారంబుగావించిన నదిహారిద్రా నది యనంబరగు. భవదీయదివ్య విమానంబునకు బాణ పాతప్రమాణంబున. పశ్చిమంబున గాభిలప్రకల్పితంబైన భవ్యజ్ఞాప్రదంబగుచు విష్ణుపుష్కరిణియనంబరగ వరంబొసంగి బహుమునిప్రణీతంబులైన బహువిధతీర్థంబులకు పావనత్వంబు గల్పించి ద్వారకంగోరక పెన్నిధిరీతిసన్నిధానంబు సేయవలయు ననవుడు శ్రీవత్సలాంఛనుండు భక్తవాత్సల్యంబున నచ్చట నిచ్చ వసియించి బృందావనతరు బృందంబుల యమునాతీర కుంజపుంజంబుల గోపగోపికాగోకులంబును క్రీడాశైలతటాగా తటాగమ్ముల మరియునచ్చటి మహీతలమహిత విహరణవిహి తోపకరణమ్ముల దక్షిణద్వారకానగరయోజనాంతంబున నిరంతరంబుగనుండ నేమించి మించి మించినకరుణాకుహనా గోపాలుండు గోప్రళయగాభిలులకు మంత్రోపదేశంబు గావించి వారలయందుదయయుంచి యచ్చట వసియించె అందు గోప్రళయుండు నందకధరపాదభజనానంద ధరుండై సాంగక్రతువిధాన సంశోధిత కల్మషుండై దక్షిణద్వారకావాస వాసవాసనావాసి తుండగుచు చక్రధరసాయుజ్య సామ్రాజ్యంబునొందె. అందలి గుణగణంబులు గణనాతిలంఘ్యంబులని మఱియు నిట్లనియె. 18

గీ. దక్షిణద్వారకాపుర స్థలమహాత్వ
మగ్నికల్పంబునను జెప్పెనందు బ్రహ్మ
తపముఁ జేసెను నిష్ట పద్మయునుహరిని
తలపునను గోరిఘననిష్టతపము జేసె. 19

క. వారిద్దఱి తపములకును
వారిజనాభుండు మెచ్చి వరమును దయచే
కోరఁగనొసఁగి మగుడఁ
జేరెను వైకుంఠపురము చిత్తమెలర్పన్. 20

గీ. దక్షిణద్వారకాపుర స్థలము మహిమ
శౌనకమహర్షికిని సూతసంయమీంద్రుఁ
డంతయునుఁ దెల్పియచ్చట నతిశయిల్లు
నలహరిద్రానదినిఁజాల యభినుతించి. 21

చ. ఇలఁగల పాపసంఘముల కెందునునిష్కృతిఁ గల్గుగాని మేల్
దలఁపనిపాపకర్ముని కృతఘ్నతకుఁ మఱిలేవు నిష్కృతుల్
తొలుతఁదొలంగినట్టి ఘనదోషము నొక్కధరాధినేతకుఁ
కల దితిహాస మొక్కటి ప్రకాశము సేసెద మీకు నెంతయుఁ.22

గీ. ఒనరు గోదావరీనది యుత్తరమున
సింధుసౌవీరమధ్య ప్రసిద్ధమగుచు
తేజమునమించి సౌరాష్ట్రదేశమందు
పుణ్యవర్తనుఁడొక మహీభుజుఁడు గలఁడు. 23

సీ. తనదు దుర్గాధిపత్యము లోకముననున్న
జననాథులకలంఘ్య శక్తిఁదెలుప
తనదు సర్వజ్ఞత్వ మనిశంబు జనముల
మనములలోనున్న మర్మమరయ
తనయుగ్రభావంబు దర్పితాహితవాస
పురములనొక్కట పొడవడంప
తనమహైశ్వర్యంబు తప్పకఁగొల్చిన
ధన్యులకును ధనదత్వమొసఁగ

గీ. తనరు తనలోక పాలకత్వప్రసిద్ధి
పరిజనుల నెల్ల లోకపాలురుగఁ జేయ
రాజశేఖరుఁడనఁగ సౌరాష్ట్రదేశ
రాజశేఖరుఁడెంతయు రహివహించు. 24

క. ఆరాజశేఖరుండును
భూరమణుఁడు వేడలాడఁ బోవఁదలంపన్
సూరెలనున్న జనంబులు
సారెకుమృగయా విహార సన్నాహమునన్. 25

సీ. సివ్వంగిబండ్లును చిఱుతబలంబులు
మోటకత్తులు తెరల్ మోకురరులు
పారెపాతెమ్ములు బదనికల్ తడకలు
చిలుకుటమ్ములు చద్దిచిక్కములును
వలలును బోనులు వల్లిత్రాళ్లొడిసెళ్లు
సెలవిండ్లు దీనుముల్ జిగురుగడలు
వెటులుగ్రోవులుమనుల్ బిసలును డేగలు
వేపులునాదిగా వెలయునట్టి

గీ. వివిధసాధనముల వేఱువేఱఁబూని
యాగ్రహవ్యగ్రులై మృగయానుసక్తి
వెల్లివిరిసినసంద్రంబు విధముమీఱ
నాటవికులెల్ల తనవెంట నంటికొలువ. 26

శా. వాహారోహమొనర్చి పార్శ్వయుగళిన్ పల్గత్కృపాణంబులన్
బాహాదండములొప్ప వీరరసతద్భావాను భావంబునన్
సాహాయ్యంబొనరించు రాచకొమరుల్ సన్నద్ధులై వెంటరా
సాహోయంచును హెచ్చరించ విభుఁ డుత్సాహంబు సంధిల్లఁగన్.

గీ. వేయువిధముల వనములో వేఁటలాడి
యెపుడు మెప్పింతుమిక నెప్పుడెప్పుడనెడు
చెంచుదొరలునుఁ దానును చేరియచట
వేటలాడంగ దొడఁగె నుర్వీవిభుండు. 20

క. దండంబిడి చెంచొక వె
దండము తొండంబువట్టి తా లాగింపఁ
కొండవలెఁ బడియెదానము
మెండుగ సెలయేర్ల రీతి మేదినినిండఁ. 29

గీ. లేటికెదురుగ రాఁబులి వేటసేయు
భూభుజా! యమ్ము రెంటిని బొలియఁజేయ
పులియు లేడియు సరిపడఁబోరిపడియె
ననరి శరవేగ మెఱుఁగక యాటవికులు. 30

ఉ. దండితనంబుమీఱ భుజదండమునందగు నేజఁబూని వే
దండముఁ జేరఁబోయి వసుధాపతి దానిమరల్పదాని యా
దండ నయుండు కొండవడిదాఁకిన చప్పుడు విన్నయప్పుడే
కొండనుకొండదాఁకె కనుగొండని చూతురు భిల్లవల్లభుల్. 31

క. పులుగులుఁజొరపిడి యొకరుఁడు
వలకేలను డేగబూని వైవగ నాసన్
వలగొన నదియును నవియునుఁ
దొలఁగెను బహ్వాశవలన దొరకునె ఫలముల్. 32

గీ. జగతిగెలుపులచే కొనుచామరమ్ము
లధికసత్వంబులుండ నియ్యడవి వింటి
కేఁటికని చామరమ్ముల నెల్లగొనిరి
చమరులనుఁజేరి శూరులు చెమరుబలిమి. 33

శా. దానప్రౌఢిమనెంచి చూచినను భూదారత్వసంరూఢిచే
యేనాటందమి నేమిటం గొదవయే మీాయమ్ము లాయమ్ములన్
క్ష్మానాథుం డిటులేయ నేటి కనుగిన్కం గోలె కోలంబు లా
రా!నించెన్ ప్రతీగాగ రక్తశరధారాసారముల్ మీఱఁగన్.

మ. వడిగా వెన్నున నిల్వనేసిన శరవ్రాతంబు నిండార నల్
గడలన్ మిన్నులురాయు కీచకశిఖా కాండప్రకాండంబుగా
పుడమింజాఱెడుక్రొత్తనెత్తురుల రొంపుల్ ధాతుపూరంబుగా
నడగొండల్ వలె నుండె వన్యగజసంతానంబు లంతంతటన్. 35

సీ. ముంచియెత్తిన రొంపిముకుగోళ్లఁజిందెనా
గగనగంగకుఁ బంకగరిమఁజూప
చింతనిప్పులురాలు చిఱుతకన్నులడాలు
దావకీలలకునుఁ గైదండలొసఁగ
ఝూడించినిలిచిన స్తబ్ధరోమములచే
బ్రహ్మండములు తూంట్లబానలుగను
ఘుఘుర్ రస్వనముల గుంభినీధరముల
గుహాలసింగంబుల గుండెలవియ

గీ. వలలచించుక చెంచులవశముగాక
యేకలం బొక్కఁ డుర్వీశు నెదుటనపుడు
ప్రళయకాల వరాహంబు పగిది హెచ్చు
వచ్చినిలిచెను ప్రజలెల్ల విచ్చిపాఱ. 36

గీ. కుండలితచాపుఁడై నృపకుంజరుండు
నిశిత శరములు నొండొండ నిగుడఁజేసి
ఘోణిఘ్రాణపుటంబున గుదులుగ్రుచ్చె
పొదలచున్నట్టివాలంపు పొదులనంగ. 37

వ. మఱియు నమ్మహీమండలాఖండలుండు మండలీకృత చండ కోదండుండై యొండొండ నిశితకాండంబులనించి చించి చెండాడు చండగవిసిన చండంబునం దమకంబు వీడ క్రోడంబు తత్తరంబునం బరువెత్తిన హత్తికత్తళాఘాటింపుచు, వెంబడిం బడి మిట్టాడు మానిసి లేనినట్టడవి మలపంయెదదప్పిచే నలపం ......ప్రాణత్రాణ పరాయణుండగును నాచక్కినొక్క యాశ్రమంబు శ్రమంబు దీఱునను తలంపునందుఁబ్రవేశించి యందునయజ్ఞయజ్ఞశీలుం గనుంగొని నమస్కరించి "అయ్యా యియ్యడవి నెయ్యెడలం దేరుగడలుదీపించె నన్నునన్నంబు పెట్టి రక్షింపుమన్నతం డన్నపానాదుల నన్నరవరుం బరితృప్తుంజేసి యనిచిన ననిచిన ముదంబున నమ్మహీకాంతుండు నిజపురంబు ప్రవేశించె నంత నొక్కనాడు.

క. మునినాథుఁడు డెందంబున
జననాథుకృతజ్ఞభావసంగతిఁ దెలియన్
జనుదెంచెను శౌర్యంబున
మునిముచ్చనుమాట లోకమునఁ దనరారన్. 38

ఉ. వచ్చి మహీమహేంద్రు తలవాఁకిటి మోసలనుండి చీకటుల్
హెచ్చినవేళనందునను నెవ్వరుగానకయుండ నేర్పుగా

సొచ్చియొకండ మేలుకలసొమ్ములనెల్లఁ గ్రహించి క్రమ్మరన్
వచ్చినఁజూచి వీధితలవర్లతనింగనికట్టి గట్టిగన్, 40

గీ. వేగఁగొలువున్నయమ్మహీవిభుని సభకు
పాశబద్ధునిఁజేసిన బ్రహ్మకులుని
తెచ్చినిలుప మహీపతి తెలియఁజూచి
యెఱిఁగియుండియు నతనితో నిట్లులనియె. 41

శా. ఓరీ! బ్రహ్మకులాధమా! నగరిలోనొంటిం బ్రవేశించి నీ
వేరీతిన్ హరియించితింత ధనమిందెవ్వారలున్ లేరె? యీ
చోరత్వంబున నెట్టు లొగ్గె మన సెచ్చోటన్ మునిశ్రేణికిన్
మీరల్ చెల్లునె చెల్లఁబోయనుచు భూమీభర్త రోషంబునన్.

గీ. తొలుతఁజేసిన మేలెల్లఁ దొలఁగఁద్రోచి
పెట్టెపెట్టుడు సొమ్ములుపట్టితీర్చి
యాజ్ఞకర్హుండుగాఁడు బ్రాహ్మణుఁడటంచు
వెడలిపొమ్మని త్రోయించె వీడు వెడల.

క. యతియును నవ్వుచు నూరక
నతివేగముతోడ నరిగె నాశ్రమమునకున్
కృతమెఱుఁగని పాతకమున
క్షితిపతియును పుణ్యకర్మశీలత తొరఁగన్ 44

సీ. మ్రొక్కి ముందటనిల్చి మోడ్పుచేతులచేత
వేఁడుకోవచ్చిన వెక్కిరించు
నాడినమాట లేయాడుచు దనమాట
లాదరింపనివారి నదరవైచు

నటులు చూపినవిద్య నటులఁగాదంచు దా
నడ్డమై కోణంగి యాటలాడు
వలెవాటువైచిన వలిపెసాలువ చించి
పెనచి పగ్గలుగాఁ బేనుచుండు

గీ. మేరమీరిన మన్మథ భారమొంది
యలఁతయాఁకలి దప్పియు ననగ వెనుక
వచ్చువారలఁగనక భూవల్లభుండు
ఘోరకాంతారవీథులఁ గ్రుమ్మరిలుచు. 45

గీ. చేరువనెయున్న యాయజ్ఞశీలువనము
చేరియాసంయమీంద్రుని చెంతనిలుప
నకట! యీతనికిటులయ్యె నాయటంచు
నార్ద్రచేతస్కుఁడై యిట్టులనియె మౌని.

క. శాపము జెందఁగ మా విభుఁ
డేపాపము సేయఁగానొ యిటులయ్యెగటా!
రూపింపగాకృతఘ్నత
ప్రాపించెను కాక యింతభంగము గలదే? 47

గీ. అనుచు మౌనీంద్రుఁ డప్పుడు ననుచుదయను
